ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
ఆదివారం 16 ఫిబ్రవరి 2025





గ్రిడ్ అనుసంధానంపై.. అధ్యయనం

30 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని..

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లల పరిధిలోని పట్టణాలు వేగంగా విస్తరిస్తున్నాయి. జనాభాతో పాటు అవసరాలు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో రానున్న 30 ఏళ్ల వరకు తాగు నీటి అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలను రూపొందించారు. ఉదాహరణకు నరసరావుపేటలో రోజుకు ప్రస్తుతం 22 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేస్తున్నారు. రానున్న 30 ఏళ్లకు మరో 15 ఎంఎల్‌డీ నీరు అవసరం ఉంటుందని అంచనా వేశారు. ఇలా 37 ఎంఎల్‌డీ నీటి అవసరం ఉండటంతో ఆ మేరకు పైపులైన్లను నరసరావుపేటకు అనుసంధానం చేస్తారు. ఇదే తరహాలో గుంటూరు కార్పొరేషన్ సహా మూడు జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో ఏ మేరకు నీటి అవసరమో ప్రాథమికంగా గుర్తించారు. నీటి సరఫరా, పైపులైన్ సామర్థ్యం పరిగణనలోకి తీసుకుని గ్రిడ్ వ్యయ అంచనాలు రూపొందిస్తారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్లెలు, పట్టణాల్లో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వాటర్ గ్రిడ్ ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు సిద్ధమైంది. ఇప్పటి వరకు వాటర్ గ్రిడ్ పల్లెలకే పరిమితం కాగా దానిని మున్సిపాలిటీలకు కూడా అనుసంధానం చేసేందుకు కసరత్తు చేస్తోంది. రూ.1,200 కోట్ల వ్యయం కాగల తొలివిడత పనులకు గ్రామీణ నీటిసరఫరా శాఖ టెండర్లు నిర్వహించి పల్నాడు జిల్లా పరిధిలోని 10 మండలాల్లోని అన్ని గ్రామాలకు రక్షిత నీరు అందించేందుకు సమాయత్తమైంది. ఈ తరుణంలో ప్రభుత్వం కొత్త ప్రతిపాదనను తెర పైకి తీసుకొచ్చింది. పల్లెలతో పాటు పట్టణాల్లో రక్షిత నీటి పథకాలను వాటర్ గ్రిడ్‌కు అనుసంధానం చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలని ప్రభుత్వం ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ పబ్లిక్‌హెల్త్ ఇంజనీరింగ్ శాఖలను ఆదేశించింది. ఈ క్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం ఇంజనీర్లు సోమవారం గుంటూరులో భేటీ (మిగతా 8వ పేజీలో)

పల్లెలు.. పట్టణాలు అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లోనూ తాగునీటికి అవస్థలే. కొన్ని ప్రాంతాల్లో అయితే ఫ్లోరైడ్ సమస్య.. వీటన్నింటికీ చెక్ చెప్పేలా.. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం దిశగా.. సురక్షిత నీటిని కుళాయిల ద్వారా ఇంటింటికీ సరఫరా చేసేలా.. వాటర్ గ్రిడ్‌ను మున్సిపాలిటీలకూ అనుసంధానం చేయనున్నారు. ఇప్పటి వరకు వాటర్‌గ్రిడ్ పల్లెలకే పరిమితం కాగా దానిని మున్సిపాలిటీలకు అనుసంధానం చేసేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో అనుసంధానంపై అధ్యయనానికి ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లు సోమవారం గుంటూరులో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. ఈ సమావేశంలో వాటర్ గ్రిడ్‌కు తుదిరూపు ఇవ్వనున్నారు. రానున్న 30 ఏళ్ల వరకు తాగు నీటి అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలను రూపొందించి నివేదికలను ప్రభుత్వానికి అందించనున్నారు.

- అమృత్ 2.0 పనులూ వాటర్ గ్రిడ్‌లోకి..
- పురాల్లో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- ప్రణాళికలు సిద్ధం చేసిన కూటమి ప్రభుత్వం
- రేపు గుంటూరులో పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ల భేటీ
- వారంలో వాటర్ గ్రిడ్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష
- గ్రిడ్‌కు అమృత్ 2.0 జలజీవన్ మిషన్ నుంచి నిధులు



గ్రిడ్ నిర్మాణం.. గ్రావిటీ ద్వారా సరఫరా

రక్షిత తాగునీటిని అందించడమే వాటర్ గ్రిడ్ లక్ష్యం. చాలా గ్రామాల్లో తాగునీటి పథకాలు బోరు నీటిపై ఆధారపడ్డాయి. బోరు నీటిని వినియోగించరాదని కేంద్రం నిర్ణయించిన నేపథ్యంలో గ్రామాలకు, పట్టణాలకు నాగార్జున సాగర్ నుంచి కృష్ణా జలాలను సరఫరా చేసే విధంగా వాటర్ గ్రిడ్ నిర్మాణం చేపట్టారు. సాగర్ వద్ద నీటి శుద్ధి ప్లాంట్‌ను నిర్మించి పైపులైన్ల ద్వారా నీటిని గ్రామాలకు సరఫరా చేయాలని గ్రిడ్‌ను రూపకల్పన చేశారు. అయితే ప్రస్తుతం గ్రిడ్‌ను మున్సిపాలిటీలకూ అనుసంధానం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంతో పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలకు పైపులైన్ నిర్మించాలని ప్రణాళిక సిద్ధం చేశారు. సాగర్ నుంచి కారంపూడి వరకు ప్రధాన పైపులైన్ నిర్మించి అక్కడ వినుకొండ, నరసరావుపేట, పిడుగురాళ్ల వైపునకు పైపులైన్లు ఏర్పాటు చేస్తారు. ఇలా ప్రతి పట్టణానికి, గ్రామాలకు పైపులైన్లను అనుసంధానం చేస్తారు. దీంతో ప్రత్యేకంగా చెరువుల్లో తాగునీటిని నిల్వ చేసే అవసరం ఉండదు. పైపులైన్ ద్వారా నేరుగా ఓవర్ హెడ్ ట్యాంకులకు నీటిని ఎక్కిస్తారు. ఆ ట్యాంకు నుంచి డిస్ట్రిబ్యూషన్ లైన్ల ద్వారా ఇంటింటికి నీటిని సరఫరా చేస్తారు. దీని వల్ల వేసవిలో కూడా తాగు నీటి ఇబ్బందులు ఉండవు. పుష్కలంగా తాగునీటి సరఫరాకు వాటర్‌గ్రిడ్ దోహదపడు తుంది. ఈ బృహత్తర పథకానికి కూటమి ప్రభుత్వం నడుంకట్టింది. గ్రావిటీపై నీటి సరఫరా చేయవచ్చని ఇంజనీర్లు చెబుతున్నారు.

మునిసిపాల్టీల వారీగా అమృత్ పథకంలో చేపట్టే పనులకు వ్యయం అంచనా వివరాలు..

మునిసిపాల్టీ	వ్యయం అంచనా రూ కోట్లలో
పల్నాడు జిల్లా..	
నరసరావుపేట	23.82
చిలకలూరిపేట	116.80
వినుకొండ	29.57
దాచేపల్లి	6.11
పిడుగురాళ్ల	24.77
గురజాల	3.17
మాచర్ల	37.53
గుంటూరు జిల్లా..	
గుంటూరు	363.23
మంగళగిరి, తాడేపల్లి	60.63
తెనాలి	2.25
పొన్నూరు	19.06
బాపట్ల జిల్లా..	
చీరాల	31.43
బాపట్ల	23.38
రేపల్లె	41.64

పోషణ.. అంతంతే



- 72 శాతం మందికే పోషకాహారం
- ధర పెరిగిందని కోడిగుడ్లలో కోత
- అంగన్వాడీలకు అరకొరగా సరుకులు
- సరుకులు అందక లబ్ధిదారులు ఇబ్బందులు

(గుంటూరు -ఆంధ్రజ్యోతి)

మంగళగిరిలోని అంగన్వాడీ కేంద్రానికి కోడిగుడ్లు తక్కువగా వచ్చాయి. ఒక్కో లబ్ధిదారుకు నెలకు 25 గుడ్లు చొప్పున ఇవ్వాల్సి ఉండగా తక్కువ సంఖ్యలో గుడ్లు రావడంతో వచ్చినవాటినే సరిపుచ్చి సిబ్బంది చేతులెత్తేశారు. కందిపప్పు, బియ్యం కూడా తక్కువగా రావడంతో వాటినే సర్దుబాటు చేయాల్సి వచ్చింది.

గుంటూరులోని ఓ అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు ఇచ్చే బాలామృతం తక్కువగా వచ్చింది. మిగిలినవారికి, కొత్తగా చేరిన వారికి బాలామృతం అందలేదు.

.. ఇది ఏదో ఒక్క అంగన్వాడీ కేంద్రంలో సమస్య అనుకుంటే పొరపాటే. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలన్నింటిలోనూ ఇదే పరిస్థితి. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే పోషణ ప్రక్రియ నెలనెలా నీరసించిపోతోంది. ఐసీడీఎస్ లెక్కలు చూస్తే గత కొన్ని నెలలుగా మూడు జిల్లాల్లోని అంగన్వాడీ లబ్ధిదారుల్లో 72 శాతం మందికి మాత్రమే పోషకాహారం అందుతుందని తెలుస్తోంది. వైసీపీ హయాంలో దెబ్బతిన్న పోషణ వ్యవస్థ కూటమి ప్రభుత్వం రాకతో ఇప్పుడిప్పుడే గాడిన పడుతుందనుకుని లబ్ధిదారులు భావిస్తున్నారు. సరిగ్గా ఈ సమయంలోనే తిరిగి పాత సమస్యలే తలెత్తుతుండడంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది.

● ఈ- కేవైసీతో అందకుండా పోతున్న బాలామృతం

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ- కేవైసీ విధానంతో చిన్నారులకు బాలామృతం అందకుండా పోతోంది. చిన్నారులకు డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, ఆధార్ వంటి గుర్తింపు కార్డులు లేకపోవడంతో చిన్నారులకు ఈ-కేవైసీ జరగడం లేదు. దీంతో వారికి బాలామృతం అందకుండానే పోతోంది. ఒక వేళ ఈ కేవైసీ పూర్తయినా అది ప్రతి నెలా 20 లోపే చేయాలి. అలా నమోదైతేనే ఆ మరుసటి నెలలో చిన్నారికి బాలామృతం అందుతుంది. లేదంటే మరో నెల వేచి చూడాల్సిందే. అలా ప్రతి నెలా 20 నుంచి 25 శాతం మందికి బాలామృతం అందడం లేదని తెలుస్తోంది. సగటున ఒక్కో అంగన్వాడీ కేంద్రంలో 50 మంది చిన్నారులు ఉంటే, 38 బాలామృతం ప్యాకెట్లు మాత్రమే వస్తున్నాయని సిబ్బంది చెబుతున్నారు. గతంలో ఏ నెలకి ఆ నెల అంగన్వాడీ (మిగతా 8వ పేజీలో)

● యాప్ ట్రాకింగ్‌తో.. అరకొర సరుకులు

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 5,339 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో మూడున్నర లక్షల మంది మహిళలు, 1.50 లక్షల మంది చిన్నారులు పోషణ పొందుతున్నారు. కేంద్ర ప్రభుత్వం యాప్ ద్వారా పోషణను అందిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం బాల సంజీవని, ఎఫ్ఆర్ఎస్ ద్వారా పోషణ అందిస్తోంది. ఆయా యాప్‌లలో నమోదైన వారికి మాత్రమే ప్రతి నెలా పోషణ అందుతుంది. ప్రతి నెలా 20 నుంచి 25వ తేదీ లోపు నమోదు కాని పక్షంలో రెండో నెల నుంచి వారికి పోషణ సరఫరా అవుతుంది. సాధారణంగా బాలింతలు, గర్భిణులు విశ్రాంతి కోసం, సంప్రదాయం ప్రకారం పుట్టిళ్లకు వెళుతుంటారు. అలా వెళ్లిన సందర్భంలో వారికి అక్కడ సమీపంలో ఉన్న అంగన్వాడీల్లో పోషణ పొందే అవకాశం ఉంటుంది. గతంలో వారి పేర్లు రిజిష్టర్లో నమోదు చేసుకుని వెంటనే బాల సంజీవని, రాగిపిండి, చిక్కీలు, అటుకులు, ఎండు ఖర్జూరం అందించేవారు. తాజా విధానం ప్రకారం వారు పుట్టింటికి వెళ్లినా, అక్కడి నుంచి తమ ఇంటికి తిరిగి వచ్చిన సందర్భాల్లో ఆయా అంగన్వాడీల్లోని యాప్‌లలో నమోదైన మరుసటి నెల నుంచి మాత్రమే సరుకులు అందుతాయి. ఈ విధానంతో అనేకమంది మహిళలు, చిన్నారులు నష్టపోతున్నారు.



షేర్ ధనం పది శాతం.. వడ్డీ భారం

సహకార పరపతి సంఘాల్లో రైతులకు దీర్ఘకాలిక రుణాలు, క్యాష్ క్రెడిట్, పంట రుణాలు ఇస్తున్నారు. వీటిలో పంట రుణం కింద రూ.3 లక్షలు, దీర్ఘకాలిక రుణాల కింద రూ.10 లక్షలు ఇస్తున్నారు. తీసుకున్న రుణంలో 10 శాతం షేర్ ధనం కింద సహకార బ్యాంకు మినహాయించుకుంటుంది. ఉదాహరణకు రైతు రూ.10 లక్షలు దీర్ఘకాలిక రుణం తీసుకుంటే రూ.లక్ష వరకు షేర్ ధనం కింద మినహాయిస్తారు. బ్యాంకు మినహాయించిన రూ.లక్షకు కూడా రైతే వడ్డీ చెల్లించాలి.

సహకారం మాకొద్దు

- సొసైటీలకు రైతులు గుడ్‌బై
- ఖాతాలు రద్దు చేసుకుంటోన్న వైనం
- మోయలేని భారంగా సహకార రుణాలు
- జీవో 472కు విరుద్ధంగా పెద్దఎత్తున వసూళ్లు

జగన్ ప్రభుత్వం వచ్చాక అదనపు ఫీజులు మోత

(గుంటూరు సిటీ - ఆంధ్రజ్యోతి)

స్టాంపు డ్యూటీ రూ.1500.. బాండ్‌కు రూ.1500.. రూ.3 లక్షల రుణానికి రూ.30 వేలు షేర్ ధనం.. రుణం రద్దు కోసం రూ.4500 చెల్లింపు.. ఇవి కాక రుణం కోసం బ్యాంకుల చుట్టూ పలుసార్లు తిరుగుడు.. ఆ పత్రాలు.. ఈ పత్రాల వ్యయం అదనం.. ఇదీ సహకార సంఘాల్లో రుణం తీసుకునే రైతులపై పడుతున్న భారం. ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుంచి రైతులకు రక్షణ కోసం ఏర్పాటైన సహకార సంఘాలు అందుకు పూర్తి విరుద్ధంగా కార్యకలాపాలు సాగిస్తున్నాయి. రుణాలకు పడే భారాన్ని భరించలేక సహకార సంఘాలకు రైతులు గుడ్‌బై చెప్పేస్తున్నారు. పెదకాకాని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(సొసైటీ) నుంచి సుమారు 80 మంది రైతులు ఏకకాలంలో వైదొలగారు. అంతేగాక అక్కడ ఉన్న రుణ ఖాతాలను కూడా రద్దు చేసుకున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 167 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల నుంచి పెద్దసంఖ్యలో రైతులు ఆకస్మికంగా బయటకు వెళ్లిపోయారు. నాలుగైదేళ్లుగా ఈ సంఖ్య క్రమేపీ పెరుగుతూ వస్తుంది. ఇందుకు కారణంపై ఆరా తీస్తే.. గతంలో ఎన్నలూ లేనివిధంగా సొసైటీల్లో రైతులకు ఇచ్చే రుణాలపై ఎడాపెడా ఫీజులు వసూలు చేయడమేనని తెలుస్తోంది. వ్యవసాయ రుణాల మంజూరు సమయంలో స్టాంపు డ్యూటీ, బాండ్, షేర్ ధనం ఇలా వివిధ రకాల పేర్లతో రైతుపై అదనపు భారాన్ని మోపడమే ప్రస్తుత పరిస్థితికి ప్రధాన కారణంగా కనిపిస్తుంది. గత వైసీపీ ప్రభుత్వంలో వసూళ్ల పర్వానికి తెరలేవగా కూటమి ప్రభుత్వంలోనూ అది కొనసాగుతోంది. ఈ పరిస్థితుల్లో రుణాల నిమిత్తం చెల్లించే ఫీజుల భారాన్ని మోయలేక రైతులు సొసైటీలకు గుడ్‌బై చెప్పేస్తున్నారు. వందల సంఖ్యలో రైతులు ఖాతాలు రద్దు చేసుకుంటే ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల మనుగడ కష్టమేనని పలువురు అంటున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇప్పటికే 60 సహకార పరపతి సంఘాలు తీవ్ర నష్టాల్లో ఉన్నాయి. ఒకేసారి వందలాది మంది రైతులు బయటకు వెళ్తే మిగిలిన సొసైటీలు కూడా అదే బాట పట్టాల్సి వస్తుంది.

రైతుపై భారం తగ్గించాలి



సహకార పరపతి సంఘాల్లో రుణాలు పొందడానికి రైతులు చాలా భారం భరిస్తున్న మాట వాస్తవమే. ఇప్పటికైనా రైతులపై పడే భారాన్ని తగ్గిస్తే బాగుం టుంది. దానివల్ల సొసైటీల మనుగడకు కూడా ఇబ్బంది కలగదు. రైతులు బయటకు వెళ్లిపోతే ఇబ్బందులకు దారి తీస్తుంది.

- ముప్పా వెంకటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు, సహకార సంఘాల ఉద్యోగుల అసోసియేషన్

జీవోకు జగన్ పాతర

సహకార పరపతి సంఘాల ద్వారా రైతులు తీసుకునే రుణాలకు స్టాంపు డ్యూటీ వసూలు చేయవద్దని 1982లో జీవో 472ను ప్రభుత్వం విడుదల చేసింది. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఆ జీవోను అమలు చేస్తూ వచ్చాయి. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత జీవోకు పాతర పడింది. సహకార సంఘాల ద్వారా రైతులు తీసుకునే రుణాలకు 0.5 శాతం స్టాంపు డ్యూటీ వసూలు చేయడం ప్రారంభించారు. రూ.3 లక్షల రుణానికి రూ.1500 వరకు చలానా కట్టిస్తున్నారు. గతంలో రుణం పొందేందుకు అవసరమైన బాండ్‌కు కూడా ఏవిధమైన ఫీజు వసూలు చేయలేదు. వైసీపీ ప్రభుత్వం బాండ్‌కు రూ.1500 ఫీజుగా నిర్ణయించింది. సహకార సంఘాల్లో రైతులు తీసుకున్న రుణాన్ని రద్దు చేసుకునే సమయంలో కూడా ఎక్కువ మొత్తంలో చెల్లించాల్సి వస్తుంది. రుణాన్ని రద్దు చేసే సమయంలో రూ.4500 వరకు చెల్లించాల్సి వస్తోంది. కొన్ని సంఘాల్లో అయితే అంతకంటే ఎక్కువే ఖర్చు అవుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇన్ని విధాలా ఖర్చులు ఉండటం వల్ల రైతుపై ఎక్కువ భారం పడుతుంది. ఫీజులు, ఇతర ఖర్చులను లెక్కేస్తే తీసుకున్న రుణానికి వడ్డీ ఎక్కువగానే పడుతున్నట్లు అర్థం అవుతుంది.

466.35 ఎకరాలు.. రూ.181 కోట్లు

- పంప్‌హౌస్‌ల నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం
- పోలవరం - బనకచర్ల అనుసంధానంలో ముందడుగు

నకరికల్లు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల అనుసంధానంలో ముందడుగు పడింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఈ పనులు వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో నిలిచి పోయాయి. కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ పనుల్లో కదలిక వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పనులను రెండు ప్యాకేజీలుగా విభజించి మెగా, నవయుగ ఇంజనీరింగ్ కంపెనీలకు అప్పగించింది. తొలి దశలో కృష్ణా నది నుంచి సాగర్ కుడి కాల్వలోకి నీటిని ఎత్తి పోసే పనులు మొదలయ్యాయి. ఐదు పంపుహౌస్‌ల నిర్మాణం దిశగా చర్యలు చేపట్టారు. గోదావరి నీటిని ప్రకాశం బ్యారేజీకి తరలించిన వైకుంఠపురం వద్ద కృష్ణా నది నుంచి తోడి నకరికల్లు మండలం నరసింగపాడు వద్ద 80వ కిలోమీటరు సాగర్ కుడి కాల్వలో పోస్తారు. ఇందుకోసం ఐదు చోట్ల పంపు హౌస్‌లను నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. తొలుత పంపుహౌస్‌ల నిర్మాణం పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఐదు పంపుహౌస్‌ల నిర్మాణానికి 466.35 ఎకరాలు సేకరించాల్సి ఉంది. ఈ భూసేకరణకు రూ.181 కోట్లతో ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం ఆమోదించింది. దీంతో భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైంది.

పంప్‌హౌస్‌లు ఇలా..

- మొదటిది: అమరావతి మండలం వైకుంఠపురం వద్ద
- రెండోది: లింగాపురంలో 11.5 కిలో మీటరు వద్ద
- మూడోది: క్రోసూరులో 35.25 కిలో మీటరు వద్ద
- నాల్గోది: రాజుపాలెంలో 47.25 కిలో మీటరు వద్ద
- ఐదోది: నకరికల్లు మండలం నరసింగపాడులో 65.45 కిలో మీటరు వద్ద

నకరికల్లు మండలంలో భూసేకరణ

ఈ ప్రాజెక్టు కింద నకరికల్లు మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో 78 ఎకరాల ప్రభుత్వ భూమి వినియోగించనున్నారు. నకరికల్లు పరిధిలో 283 ఎకరాలు, నరసింగపాడులో 341.91 ఎకరాలను సేకరించాల్సి ఉంది. నరసింగపాడులో పంపు హౌస్ నిర్మాణానికి జలవనరుల శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. గ్రావిటీ ద్వారా కాల్వ తీసేందుకు 190 ఎకరాలను సేకరించాల్సి ఉంది. కాగా జలవనరుల శాఖ అధికారులు రెవెన్యూ అధికారులతో భూసేకరణకు చర్చలు జరుపుతున్నారు.

ఎకరాకు రూ.50 లక్షలు కావాలి

ఎకరాకు రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలని పోలవరం-బనకచర్ల అనుసంధానంలో భూములు కోల్పోతున్న నరసింగపాడు రైతులు కోరుతున్నారు. తమ భూములు సారవంతమైనవే కాకుండా తమ జీవనాధారమని రెండు పంటలు పండుతాయని ప్రభుత్వం ఇచ్చే పరిహారం తమకు ఆమోదయోగ్యం కాదంటున్నారు. భూముల పరిహార విషయంపై రైతులు అధికారులపై, ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తెస్తున్నారు.

తెలుగు నాటకాన్ని ప్రోత్సహించండి

● రంగస్థలి వార్షికోత్సవ సభలో ఎంపీ లావు



సభలో మాట్లాడుతున్న నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు

నరసరావుపేట కల్చరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు నాటకాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని నరసరావుపేట పార్లమెంటు సభ్యుడు లావు శ్రీకృష్ణదేవ రాయలు కోరారు. శనివారం భువనచంద్ర టౌన్‌హాల్‌లో జరుగుతున్న నరసరావుపేట రంగస్థలి 45వ వార్షికోత్సవం, 24వ జాతీయ స్థాయి ఆహ్వాన తెలుగు నాటిక పోటీల రెండో రోజు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ జీవితాన్ని కళలు ప్రతిబింబిస్తాయని, సమాజంలో ఉన్న సమస్యలను ఎత్తిచూపుతూ కళలు చైతన్యాన్ని కలిగిస్తాయన్నారు. కమ్యూనిస్టులు కళల ద్వారానే సమస్యలను పాలకులకు ఎత్తి చూపేవారని గుర్తు చేశారు. ప్రభుత్వం వైపు నుంచి ఏ సహకారం కావాలన్నా, తన దృష్టికి తెస్తే తప్పకుండా సహాయ సహకారం అందిస్తానని నిర్వాహకులు అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కాగా రంగస్థలి ప్రతిభా పురస్కారం ప్రముఖ నాటక రచయిత, నటులు, దర్శకులు చలసాని కృష్ణ ప్రసాద్‌కు అందజేశారు. పురస్కార గ్రహీతను ఎంపీ లావు చేతుల మీదుగా సత్కరించారు. ఆత్మీయ అతిథులు ఎం.ఎ.ఎం కళాశాలల చైర్మన్ ఎం.ఆర్.శేషగిరిరావు, సంరక్ష సొసైటీ జనరల్ సెక్రటరీ బిఆర్ సుశీల్‌కుమార్‌లను రంగస్థలి నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. రెండో రోజు ప్రదర్శించిన కళాంజలి, హైదరాబాద్ వారి అన్నదాత నాటిక ప్రేక్షకులను కంటతడి పెట్టించింది. రెండో ప్రదర్శనగా వెలగలేరు థియేటర్ ఆర్ట్స్, వెలగలేరు వారి రాత నాటిక ఆలోచింపచేసింది. కపలవాయి రాజేంద్రప్రసాద్. రాకీ మీడియా అధినేత నల్లపాటి రామచంద్రప్రసాద్ పాల్గొన్నారు. రంగస్థలి మాజీ అధ్యక్షుడు కిలారు వెంకట్రావ్ అధ్యక్షత వహించగా, రంగస్థలి కార్యవర్గ సభ్యులు కార్యక్రమాలు నిర్వహించారు.

మెప్మాలో వెలుగు చూస్తున్న అక్రమాలు

● గ్రూప్‌లుగా ఏర్పాటు చేసి అనర్హులకు పెద్దఎత్తున రుణాలు

బాపట్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బాపట్ల పట్టణంలోని మెప్మా విభాగంలో బినామీల అక్రమాలు బయటపడుతున్నాయి. గత ప్రభుత్వంలో జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణ లబ్ధిదారులను గ్రూప్‌లుగా ఏర్పాటు చేసి బ్యాంక్ రుణాలు ఇప్పించి గృహాలు నిర్మించుకునే విధంగా ప్రోత్సహించాలని జిల్లా అధికారులు ఆదేశించారు. దీంతో అర్హులతోపాటు అనర్హులను కలిపి గ్రూప్‌లుగా ఏర్పాటు చేసి పెద్దఎత్తున రుణాలు ఇప్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి. 2022 - 2023 సంవత్సరంలో సుమారు 62 స్వయం సహాయక సంఘాలు నూతనంగా ప్రారంభించారు. వీరికి సుమారు రూ.5 కోట్ల రుణాలుగా ఇచ్చారు. వీరిలో ఎక్కువ మంది బినామీలుగా ఉన్నట్లు సమాచారం. కొంతమంది 5 నుంచి 6 గ్రూప్‌లలో ఉన్నట్లు తెలిసింది. తీసుకున్న రుణం సకాలంలో చెల్లిస్తూ వస్తే ఏ ఇబ్బంది ఉండేది కాదు. బ్యాంక్ రుణాలు మాఫీ చేస్తారనే ఆలోచనతో పెద్దఎత్తున రుణాలు తీసుకొని తిరిగి చెల్లించకుండా ఉండిపోయారు. తీరా బ్యాంక్‌లకు డబ్బులు చెల్లించకపోవటంతో లాయర్ నోటీసులను పంపించారు. వీటిని మెప్మా సీఎంఎం ద్వారా గ్రూప్‌ల వారికి అందజేశారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కమిషనర్ జి.రఘునాథరెడ్డి సీఎంఎం ఎన్.సుబ్రహ్మణ్యంను ఆదేశించారు. తాజాగా జ్యోతి మహిళా పొదుపు సంఘం సభ్యురాలుగా ఉన్న ఎస్.మేరీప్రసన్న కుమారికి అప్పట్లో బ్యాంక్ రుణం రూ. 30 వేలు మంజూరు చేశారు.మంజూరు చేసిన రుణంలో కేవలం రూ. 10 వేలు మాత్రమే ఆర్పి రజియా తనకు ఇచ్చిందనీ, తిరిగి మొత్తం బ్యాంక్‌కు చెల్లించినట్లు ఆమె తెలియజేసింది. ప్రస్తుతం బ్యాంక్ లావాదేవీలు చూస్తే తాను ఇంకా లక్షా 90 వేలు రూపాయిలు బకాయిలు ఉన్నట్లు తెలిపారు. దీంతో లబోదిబోమంటూ ఆ యువతి మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డికి ఫిర్యాదు చేసింది. కమిషనర్ దీనిపై విచారించాలని మెప్మా సీఎంఎం ఎన్.సుబ్రహ్మణ్యంను ఆదేశించారు. విచారించిన సీఎంఎం సదరు గ్రూపునకు ఇంకా రూ. 19 లక్షలు బకాయి ఉన్నట్లు తేల్చారు. దివ్యాంగురాలైన మేరీప్రసన్నకుమారి తనకు న్యాయం చేయాలని శనివారం మెప్మా కార్యాలయంలో బోరున విలపించింది. ఈ విషయమై సీఎంఎంను వివరణ కోరగా ఇలాంటి అక్రమాలు అనేకం జరిగినట్లు తెలిసిందనీ, వీటన్నిటిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తామని చెప్పారు.

కమిటీ సభ్యులను మార్చాలి

పెదకాకాని, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో కొద్ది రోజులుగా లా విభాగంలో జరుగుతున్న వివాదాన్ని పరిష్కరించేందుకు శుక్రవారం అధికారులు నియమించిన కమిటీలో మార్పు చేయాలని దళిత విద్యార్థి సంఘం నాయకులు శనివారం రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలంను కలిసి వినతిపత్రం అందజేశారు. లా విభాగంలో పనిచేస్తున్న రిటైర్డ్ ప్రొఫెసర్ ఎల్. జయశ్రీని తక్షణమే విధుల నుంచి తొలగించాలని పేర్కొన్నారు. కమిటీలో సభ్యులుగా ఉన్న రంగయ్యను కూడా మార్చాలని, ఎటువంటి సంబంధం లేని డీన్ సుధాకర్‌ను కూడా మార్చివేయాలని కోరారు. కమిటీలో తప్పనిసరిగా షెడ్యూల్ కులాలకు చెందిన ప్రొఫెసర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ఎన్డీఎస్ఎఫ్, డీఎస్ఏ, ఎంఎస్ఎఫ్ విద్యార్థి సంఘ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా..

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వ్యాయామ విద్య నూతన ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ పీపీఎస్ పాల్ కుమార్ నియమితులయ్యారు. శనివారం ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు నియామక ఉత్తర్వులను పాల్ కుమార్‌కు అందజేశారు. పాల్ కుమార్ ప్రస్తుతం వ్యాయామ విద్య డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

నా భర్త ఆచూకీ తెలియజేయండి

● పల్నాడు జిల్లా ఎస్పీని ఆశ్రయించిన భార్య



ఎస్పీ కార్యాలయ ఆవరణలో మాట్లాడుతున్న మాధవి

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీ నారాయణపురం ఎస్‌బీఐలో గతంలో గోల్డ్ అప్రైజర్‌గా పని చేస్తున్న తన భర్త చేపూరి పూర్ణచంద్రరరావు గత కొద్ది రోజుల నుంచి కన్పించటం లేదని, ఆయన ఆచూకీ తెలియ జేయాలని పూర్ణచంద్రరరావు భార్య మాధవి, ఆమె బంధువులు శనివారం ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఎస్పీ కార్యాలయ ఆవరణలో విలేకరులతో మాధవి మాట్లాడుతూ.. 'గతంలో దాచేపల్లి పీఎస్‌లో, ప్రస్తుతం గురజాల డీఎస్పీ కార్యాలయంలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు వద్ద పూర్ణచంద్రరరావు రూ.3 లక్షలు అప్పు తీసుకున్నాడు. వడ్డీ రూపంలో రూ.లక్ష చెల్లించాడు. మిగిలిన డబ్బులు చెల్లించకపోవతో డబ్బులు చెల్లించాలని హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు పూర్ణచంద్రరావుపై ఒత్తిడి తెచ్చాడు. అనంతరం జనవరి 25న పూర్ణచంద్రరరావును, తన మామను దాచేపల్లి పోలీసుస్టేషన్‌లో ఉంచి ఇబ్బంది పెట్టారని మాధవి తెలిపింది. అనంతరమే పూర్ణచంద్రరావు, తన మామ ఇద్దరూ కనపడకుండా పోయారని, హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావే వారిని తీసుకు వెళ్లుంటాడాడని ఆరోపించింది. ఈ విషయంపై వెంటనే విచారణ చేపట్టాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం.

మృతుల కుటుంబాలకు నష్టపరిహారం విడుదల

గుంటూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు గురై ఉమ్మడి గుంటూరు జిల్లాలో చనిపోయిన నలుగురు వ్యక్తుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం విడుదల చేసింది. ఫిరంగిపురం మండలం సిరింగిపాలెంకు చెందిన పెరికల జ్యోతి, మంగళగిరి మండలంలోని ఆత్మకూరుకు చెందిన రావూరి రాణి, అమరావతి మండలంలోని ధరణికోటకు చెందిన బలుసుపాటి వినయ్, దాచేపల్లి మండలంలోని తంగెడకు చెందిన దారం మణికంఠ పిడుగుపాటుతో చనిపోయారు. వీరి కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాని శనివారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది.

మహాశివరాత్రికి 163 ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

గుంటూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న మహాశివరాత్రి పురస్కరించుకొని ఆర్టీసీ 163 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తుంది. ఈ నెల 25న సాయంత్రం నుంచే ప్రత్యేక బస్సులు అందుబాటులోకి తెస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఎమ్ రవికాంత్ తెలిపారు. మహాశివరాత్రికి శైవక్షేత్రాలకు వెళ్లే భక్తులకు ఎటువంటి సమస్యల్లేకుండా ఆర్టీసీ పరంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. విభజిత జిల్లాలోని గుంటూరు-1, 2 డిపోలతో పాటు మంగళగిరి, తెనాలి, పొన్నూరు డిపోల నుంచి మొత్తం 163 సర్వీసులను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గుంటూరు నుంచి కోటప్పకొండ తిరునాళ్లకు వెళ్లే భక్తుల కోసం గుంటూరు-1, 2 డిపోలతోపాటు మిగతా మూడు డిపోల నుంచి నరసరావుపేట వరకు 88 బస్సులను ఆపరేట్ చేయనున్నారు. ప్రతి పది నిమిషాలకో బస్సు ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇక శ్రీశైలం, అమరావతి, క్వారీ, గోవాడ వంటి మిగతా శైవక్షేత్రాల కోసం అదనంగా 75 బస్సులను సిద్ధం చేస్తున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అవసరమైతే అదనపు సర్వీసులను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని డీపీటీవో పేర్కొన్నారు.

వృద్ధురాలి హత్యకేసులో ఇద్దరు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ మధుపవన్

పెదనందిపాడు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం పెదనందిపాడుకు చెందిన వృద్ధురాలిపై అత్యాచార, హత్య కేసులో ఇద్దరు ముద్దాయిలను అరెస్టు చేసినట్లు ప్రత్తిపాడు సీఐ శ్రీనివాసరావు శనివారం తెలిపారు. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో రేకుల షెడ్డులో నివాసం ఉంటున్న యార్ల రమణమ్మ(64)పై ఈ నెల 2వ తేదీ వేకువజామున అదే ప్రాంతానికి చెందిన పాత నేరస్తులు పాలపర్తి మంజు, పాలపర్తి సాంబ సోదరులు అత్యాచారం చేసి హతమర్చారు. అదే రోజు రమణమ్మ కూతురు వీరమ్మ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దర్యాప్తు చేశారు. సంఘటనా స్థలంలో క్లూస్ టీం వేలిముద్రలు నేరస్తుల వేలిముద్రలు సరిపోవడంతో వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం రాత్రి పెదనందిపాడులో సంచరిస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితులు గతంలో ఒక అత్యాచార కేసులో జైలుకు వెళ్లి వచ్చారనీ, సాంబ చెడు వ్యసనాలకు బానిసై దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. రమణమ్మ హత్య కూడా తామే చేసినట్లు విచారణలో అంగీకరించడంతో వారిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరుపరిచారు. సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ మధుపవన్, సిబ్బందిని ఎస్పీ సతీష్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

విద్యుదాఘాతానికి రైతు మృతి

కొల్లూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి ఓ రైతు మృతి చెందిన సంఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చినపులివర్రు గ్రామానికి చెందిన మాతంగి వరరాజబాబు (59) మొక్కజొన్న పంటకు నీరు అందిస్తున్నాడు. ఉదయం నుంచి పొలం పనుల్లో నిమగ్నమైన రైతు దాహం వేయడంతో మోటారు వద్దకు వెళ్లి నీరు తాగే క్రమంలో పైపునకు విద్యుత్ ప్రసరించడంతో షాక్‌కు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు కాపాడేందుకు వాహనంలో వైద్యశాలకు తీసుకు వెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచి సమాచారాన్ని విద్యుత్ శాఖ ఏఈ సుధాకరబాబు, ఎస్ఐ ఏడుకొండలుకు తెలియజేశారు. కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు స్వీకరించి మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపుతామని ఎస్ఐ తెలిపారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు

దుగ్గిరాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదపాలెం గ్రామంలో 1100 గ్రాముల గంజాయిని దుగ్గిరాల పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల గంజాయి వ్యసనం బారిన పడిన యువకులు కొందరు కొనుగోలు చేస్తున్నట్లు సమాచారంతో ఎస్సై ఎస్. వెంకటరవి నిఘా వేసి పట్టుకున్నారు. నలుగురు విక్రేతలతో పాటు ఇద్దరు వినియోగదారులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కాగా గంజాయి విక్రేతల్లో ఒకరు పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. చిలువూరు, రేవేంద్రపాడు పరిసరాలు గంజాయికి అడ్డాగా మారిన విషయం విదితమే.

వేటపాలెం ఎడ్లకు ప్రథమ స్థానం



పోటీల్లో వేటపాలెం ఎడ్లు

మాచవరం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఎడ్ల పోటీల ప్రదర్శనలు ఆదివారంతో ముగిశాయి. సేద్యం విభాగంలో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీషా చౌదరి, శివ కృష్ణ చౌదరి ఎడ్లు 3770.9 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. ప్రకాశం జిల్లా సంతమాగులూరు గ్రామానికి చెందిన వజ్రాల తేజశ్వనీరెడ్డి ఎడ్లు 3250 అడుగుల దూరాన్ని లాగి రెండో స్థానంలో, పల్నాడు జిల్లా క్రోసూరు మండలం ఉయ్యందన గ్రామానికి చెందిన సంపటం వీర బ్రహ్మనాయుడు ఎడ్లు 3149.7 అడుగుల దూరాన్ని లాగి మూడో స్థానంలో, ప్రకాశం జిల్లా బల్లికురవ మండలం ఉప మాగులూరు గ్రామానికి చెందిన కనుబుద్ది రవి శంకర్‌రెడ్డి ఎడ్లు 2798.6 అడుగుల దూరాన్ని లాగి నాలుగో స్థానంలో, పల్నాడు జిల్లా మాచవరం గ్రామానికి చెందిన ముక్కపాటి హనుమంతరావు చౌదరి ఎడ్లు 2792 అడుగుల దూరాన్ని లాగి ఐదో స్థానంలో, ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం మర్రివేముల గ్రామానికి చెందిన సిద్ది మల్లేశ్వరి ఎడ్లు 2567.3 అడుగుల దూరాన్ని ఆరో స్థానంలో, పల్నాడు జిల్లా గురజాల మండలం చర్లగుడిపాడు గ్రామానికి చెందిన రాయంకుల రామారావు చౌదరి ఎడ్లు 1505 అడుగుల దూరాన్ని లాగి ఏడో స్థానంలో నిలిచాయి. వీరికి నగదు బహుమతులతో పాటు షీల్డ్ బహూకరించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా గూడా శ్రీనివాసరావు, తంగెడ హసన్‌లు వ్యవహరించారు.

జీవితంలో కృత్రిమ మేధస్సు అంతర్భాగమే



అధ్యాపకులను సత్కరిస్తున్న వర్సిటీ తాత్కాలిక ఉపకులపతి కంచర్ల గంగాధరరావు

పెదకాకాని, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సమకాలీన సమాజంలో కీలకమైన భాగంగా కృత్రిమ మేధస్సు ఉద్భవించిందనీ, విభిన్న కోణాలలో తీవ్ర ప్రభావాన్ని చూపుతోందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు పేర్కొన్నారు. కృత్రిమ మేధపై గత రెండు రోజులుగా వర్సిటీలో జరుగుతున్న జాతీయ స్థాయి సదస్సులో ఆయన మాట్లాడుతూ కృత్రిమ మేధ విస్తృత ప్రభావం, ఆరోగ్య సంరక్షణ, విద్య, వినోదంపై విస్తరించి ఉందన్నారు. హైదరాబాదులోని వర్ధన్ డేటా సైన్స్ అధ్యక్షుడు ఎస్.వి. రమణమూర్తి మాట్లాడుతూ రాబోయే రోజులలో మనిషి జీవన విధానాన్ని సులభతరం చేయబోతుందనీ, అనేక రంగాలలో సమర్థతను పెంచుతుందని తెలిపారు. సదస్సులో కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అధ్యాపకులు డాక్టర్ కె.లావణ్య, డాక్టర్ జి.నీలిమ, డాక్టర్ యూ. సూర్య కామేశ్వరి, డాక్టర్ ఆర్ వసంత, పుష్పలత, డాక్టర్ బసవేశ్వరరావు పాల్గొన్నారు. పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వస్తువు నాణ్యతతో నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి

పెదకాకాని, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూ వాణిజ్య విభాగంలో రెండు రోజులుగా జరుగుతున్న వ్యాపార విశ్లేషణ- మేధస్సు పురోగతి అనే రెండు రోజుల యూజీసీ జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది. కార్యక్రమంలో ఇన్‌చార్జి రెక్టార్ ఆచార్య కె.రత్న షీలామణి మాట్లాడుతూ వస్తు ఉత్పత్తిపై అవగాహన ఉండాలని, వస్తువు నాణ్యత పాటించినట్లయితే వినియోగదారుడు దానిపై నమ్మకాన్ని నిలబెట్టుకుంటారని పేర్కొన్నారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, విభాగాధిపతి, జాతీయ సదస్సు డైరెక్టర్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్, పాండిచ్చేరి యూనివర్సిటీ ప్రొఫెసర్ రాజేష్ విశ్వనాథన్, అధ్యాపకులు వై.శ్రీనివాసులు, సంయుక్త ఇన్ఫో టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో బుచ్చిబాబు, తదితరులు వారి అనుభవాలను పంచుకున్నారు. అనంతరం పరిశోధన పత్రాలు సమర్పించిన వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. విభాగం అధ్యాపకులు డాక్టర్ ఎస్.రత్న కిషోర్, డాక్టర్ ఎ.కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111,119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

'పది' పరీక్షలకు నాలుగు కేంద్రాలు

రెంటచింతల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రెంటచింతలలో వైఆర్ఎస్ స్కూల్, సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల, ఫాతిమా విద్యా నికేతన్, సెయింట్ ఆన్స్ పాఠశాలలను మార్చిలో జరగనున్న టెన్త్ పరీక్షలకు పరీక్షా కేంద్రాలుగా నిర్ణయించినట్లు ఎంఈవో2 శివ నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న జడ్జీలు శ్రీనివాస్ కళ్యాణ్, ప్రశాంత్

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మాచర్లటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో మార్చి 8న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని న్యాయాధికారులు శ్రీనివాస్ కళ్యాణ్, ప్రశాంత్‌లు సూచించారు. శనివారం కోర్టు ఆవరణలో వారు విలేకరులతో మాట్లాడుతూ రాజీ మార్గం రాజ మార్గమని, రాజీపడదగిన కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని కక్షిదారులకు సూచించారు. కేసుల రాజీతో సమయం, ధనం ఆదా అవుతుందన్నారు. లోక్ అదాలత్ నిర్వహణకు న్యాయవాదులు సహకరించాలని కోరారు.

గడ్డి వాము దగ్ధం

గురజాలటౌన్, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బంగ్లా సెంటర్ సమీపంలో పట్టణానికి చెందిన బొజ్జా వెంకటనారాయణ, గువ్వల కొండలు అనే రైతులకు చెందిన సమారు 50 కట్టల వరిగడ్డి వాము దగ్ధమైంది. విషయం తెలుసుకున్న ఎస్ఐ వినోద్‌కుమార్ ఘటనా ప్రదేశానికి చేరుకొని అగ్నిమాపక కేంద్రానికి సమాచారమిచ్చారు. ఫైర్ సిబ్బంది వచ్చేలోపే గడ్డి వాము పూర్తిగా దగ్ధమైంది. బాధితుల ఫిర్యాదు మేరకు విచారిస్తున్నట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు.

అదుపు తప్పి లారీ బోల్తా

వెల్దుర్తి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): లారీ అదుపుతప్పి బోల్తా పడిన సంఘటన మండలంలోని మండాది బోడు వద్ద శనివారం జరిగింది. పాత ఇనుప సామాన్లతో ఒంగోలు నుంచి హైదరబాద్ వెళ్తున్న లారీ మార్గ మధ్యంలోని మండాది బోడు వద్ద అదుపు తప్పి రోడ్డుపై బోల్తా పడింది. ఈ సంఘటనలో డ్రైవరు, క్లీనర్ వేమారెడ్డి, అశోక్‌కుమార్ రెడ్డిలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సమందర్‌వలి సంఘటన ప్రదేశానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

రోడ్డు భద్రతా నియమాలపై విద్యార్థులకు అవగాహన

దాచేపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణపై దాచేపల్లిలోని స్కాలర్స్ పాఠశాల విద్యార్థులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. శనివారం దాచేపల్లిలోని పోలీసు స్టేషన్ నుంచి నారాయణపురంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లా వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం మానవ హారం నిర్మించారు. అతి వేగం, హెల్మెట్ లేక పోవటం, రోడ్డు భద్రత సూచనలను పాటించక పోవటం ప్రమాదాల కారణంగా వివరించారు. ఆయా కార్యక్రమల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో శనివారం రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమం డిపో మేనేజర్ విజయ కుమార్ ఆధ్వర్యంలో డిపో ట్రాఫిక్ సీఐ కే పాతిమ రోశమ్మ తదితరులు నిర్వహించారు. పిడుగురాళ్ళ మోటారు వెహికల్ అసిస్టెంట్ అధికారి ఎం నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రమాద రహిత డ్రైవర్లు ఎస్‌కే రషీద్‌కు ప్రథమ బహుమతి, బీపీ రావుకు ద్వితీయ బహుమతి, టీఆర్ కృష్ణకు తృతీయ బహుమతి నగదు అందించి, సన్మానించారు. కార్యక్రమంలో ఆర్టీసీ సూపర్ వైజర్లు, ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారయత్నం

దాచేపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్ళ చిన్నారిపై 70 ఏళ్ళ వృద్ధుడు అత్యాచారయత్నంకు పాల్పడిన ఘటనలో నిందితుడిపై ఫోక్సోకేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పాపారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్ళగా, ఇంట్లో నిద్రిస్తున్న బాలికను రామకృష్ణ అనే వృద్ధుడు అత్యాచారం చేసేందుకు ప్రయత్నించాడు. చిన్నారి భయంతో కేకలువేయగా చుట్టుపక్కల వారు వచ్చారు. దీంతో ఆ వృద్ధుడు అక్కడి నుంచి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు వృద్ధుడిని పట్టు కొని పోలీసులకు అప్పగించి ఫిర్యాదు చేశారు. డీఎస్పీ వెంకటరమణ విచారించిన అనంతరం ఫోక్సో కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

స్వచ్ఛాంధ్ర..స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యం

- ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు
- ప్రభుత్వ కార్యాలయాల్లో చెత్త తొలగింపు
- ప్రతి నెలా 3వ శనివారం శ్రమదానం
- వివిధ ప్రాంతాల్లో ప్రతిజ్ఞలు, ర్యాలీలు



మాచర్లలో మొక్కలు నాటుతున్న ఎంవీఐ శేషురెడ్డి

మాచర్లటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యంగా బాధ్యతాయుతంగా పని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎంవీఐ శేషురెడ్డి అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని రవాణా శాఖ కార్యాలయంలో మొక్కలను నాటారు. ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాలు చేపడుతున్నట్లు శేషురెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మెట్టు గోవిందరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు కాలనిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

మాచర్ల రూరల్, (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ఏపీ జెన్‌కో ఆధ్వర్యంలో మండలంలోని విజయపురిసౌత్‌లోని జెన్‌కో క్వార్టర్స్ వద్ద శనివారం స్వచ్ఛాంధ్రా - స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు క్వార్టర్స్ పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈలు రాజారెడ్డి, అక్బర్, రమణారావు, ఏఈలు గౌతమ్,శ్రీను, శ్రీనివాస్, రేవతి, సల్మా, రాణిబాయి, మనోహరమ్మ, రాణి, ఎస్‌పీఎఫ్ ఎస్ఐ సత్యమూర్తి, డాక్టర్ రేవంత్, చందు, రామకృష్ణ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రెంటచింతల,(ఆంధ్రజ్యోతి): టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు కాలనీలో విద్యుత్ ప్రాజెక్టు అధికారులు స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎస్ఈ వెంకటరమణ ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో జీఎం శ్రీనివాసరావు, డీఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు, ఏడీఈ రత్తయ్య, జీవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారంపూడి, (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్, రెవెన్యూ కార్యాలయాల వద్ద స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా అధికారులు చెత్తా చెదారం ఊడ్చి శుభ్రపరిచారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ నాయక్, ఎంపీడీవో గంటా శ్రీనివాసరెడ్డి, ఈవోపీఆర్డీ కసిన్యానాయక్, ఆర్ఐ శ్రీనివాసరావు, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే శ్రీచక్ర సిమెంట్ ఫ్యాక్టరీలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం చేపట్టారు.

దుర్గి,(ఆంధ్రజ్యోతి): దుర్గి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో శివప్రసాద్ ఆధ్వర్యంలో ఉద్యోగులు, సిబ్బంది పిచ్చి మొక్కలను తొలగించారు.

పిడుగురాళ్ల, (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని పిడుగురాళ్ల పట్టణంలోని 33 వార్డుల్లో నిర్వహించారు.పట్టణంలోని గాంధీనగర్ సచివాలయం పరిధిలోని 21, 22 వార్డుల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో మునిసిపల్ కమిషనర్ పి.శ్రీధర్ పాల్గొని



పిడుగురాళ్ల గాంధీనగర్ ప్రాంతంలోని రోడ్లను శుభ్రం చేస్తున్న ఉద్యోగులు



మాచవరంలో ప్రతిజ్ఞ చేస్తున్న పలు ప్రభుత్వ శాఖల ఉద్యోగస్తులు

రోడ్లపై చెత్తను శుభ్రంచేశారు. కార్యక్రమంలో శానిటేషన్ అధికారులు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

మాచవరం,(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలు, సచివాలయాల్లో స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో ఉపాధ్యాయులు, హెచ్ఎంలు, విద్యార్థులు, సచివాలయాల్లో ఉద్యోగులు, సిబ్బంది పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం గ్రామాల్లో ర్యాలీలు చేపట్టి, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో వెంగళరావు, వైద్యాధికారులు ప్రసాదరావు, అన్వేష్, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, క్రాప్‌మిత్రలు పాల్గొన్నారు.



సత్తెనపల్లి పట్టణంలోని రంగా కాలనీలో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ షమ్మి

సత్తెనపల్లి,(ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పట్టణ ప్రజలంతా సహకరించాలని మునిసిపల్ కమిషనర్ షమ్మి కోరారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా 2వ వార్డులోని రంగా కాలనీలో స్వచ్ఛంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారథి, పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులు, మెప్మా టీఎంసీ, డ్వాక్రా సభ్యులు, శానిటరీ మేస్త్రిలు తదితరులు పాల్గొన్నారు. స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయంలోనూ స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రెజరీ ఆవరణలో వ్యర్థాలను తొలగించారు.

సంత్ సేవాలాల్‌కి ఘన నివాళి



సేవాలాల్ జయంతిలో గిరిజన నేతలు

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్‌లో సంత్ శ్రీసేవాలాల్ మహరాజ్ 286వ జయంతిని శనివారం ఆలయ ధర్మకర్త కరంటోత్ పాండునాయక్ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. అర్చకుడు శ్రీనునాయక్ ఆధ్వర్యాన స్వామి వారికి పూజలు జరిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పంగులూరి అంజయ్య, వీరాస్వామి యాదవ్, బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, సాతులూరి కుమార్, శ్రీను, డాక్టర్ బసివిరెడ్డి పాల్గొన్నారు.

పిడుగురాళ్ల, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 8వ వార్డు తండా కూడలిలోవున్న సంత్ సేవాలాల్ మహరాజ్ విగ్రహానికి బంజారాలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహరాజ్ సేవలను కొనియాడుతూ పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డుఇన్‌చార్జ్ సయ్యద్ అమీర్ అలి, బూత్ కన్వీనర్ మూడావత్ సామానాయక్, మాజీ కౌన్సిలర్ వడితె రంగానాయక్, రాంజానాయక్, ఢాకు నాయక్, శేఖర్ నాయక్, బాణావత్ చందు నాయక్, నరసింహనాయక్, కుమార్‌నాయక్, తెల్లబాటి శ్రీను, రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి, (ఆంధ్రజ్యోతి): సద్గురు సేవాలాల్ మహరాజ్ జయంతిని పురస్కరించుకొని శనివారం పట్టణంలోని టీడీపీ బంజార నేతలు కేతావత్ శంకర్ నాయక్, కాట్రావత్ పురుషోత్తం నాయక్, రూపావత్ సురేష్ నాయక్, బాణావత్ రామకృష్ణా నాయక్‌లు గుంటూరు ఎమ్మెల్యే కన్నాను కలసి సన్మానించి సేవాలాల్ మహరాజ్ చిత్రపటాన్ని బహుకరించారు.



ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు జ్ఞాపికను అందించిన సత్తెనపల్లి టీడీపీ బంజారా నేతలు



సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఈ శ్రీనివాసరావు

అమరలింగేశ్వరస్వామిని దర్శించుకున్న డీఈ శ్రీనివాసరావు

గురజాలటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దైద బిలంలోని అమరలింగేశ్వరస్వామిని శనివారం దేవాదాయశాఖ డీఈ సీహెచ్ శ్రీనివాసరావు దర్శించుకున్నారు. అనంతరం దేవస్థానం అభివృద్ధిలో భాగంగా డీజీపీఎస్ సర్వేపై సిబ్బందికి సూచనలు చేశారు. ఉత్తర, ఈశాన్య మూలలో దారిని మూసివేయాలన్నారు. మాస్టర్ ప్లాన్ తయారీ, శిథిలావస్థలో ఉన్న గుహ వెలుపల దేవస్థానాలను దాతల సాయంతో పునర్నిర్మించేందుకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట దేవాదాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

చైర్‌పర్సన్ మార్పుకు అసమ్మతి కౌన్సిలర్ల యత్నం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి పురపాలకసంఘం చైర్ పర్సన్ చలంచర్ల లక్ష్మీతులసీని పదవి నుంచి తప్పించేందుకు వైసీపీ అసమ్మతి కౌన్సిలర్లు సోమవారం సమావేశమయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల అనంతరం లక్ష్మీతులసీపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. లక్ష్మీ తులసీ 25వ వార్డు వైసీపీ కౌన్సిలర్‌గా కొనసాగుతున్నారు. పురపాలక సంఘ పరిధిలో 31 మంది కౌన్సిలర్లకు గాను వైసీపీకి చెందిన వారు 24 మంది ఉండగా, వారిలో ముగ్గురు టీడీపీలో చేరారు. మరో ఆరుగురు ఇటీవల ఎమ్మెల్యే కన్నాను కలసి పార్టీలో చేరేందుకు సంసిద్ధత వ్యక్తంచేశారు. మిగిలిన 15 మంది కౌన్సిలర్లు చలంచర్ల లక్ష్మీతులసీ భర్త షాడో చైర్మన్‌గా వ్యవహరించటాన్ని జీర్ణించుకోలేక అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సమావేశాలు నిర్వహిస్తున్నారు. వీరికి మద్దతుగా జనసేన, టీడీపీ ఇండిపెండెంట్ కౌన్సిలర్లు ఉన్నారు. ఆదివారం చైర్‌పర్సన్ భర్త అవినీతిపై బహిరంగంగా విలేకరుల సమావేశం నిర్వహించి తెలియజేస్తామని జనసేన కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్ తెలిపారు. ప్రస్తుతం ఈ విషయం పట్టణంలో తీవ్ర చర్చనీయాంశంగా ఉంది.

సొంత భూమి కలిగిన రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలి

- క్రోసూరు ఏడీఏ వీ హనుమంతరావు

క్రోసూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రైతులందరూ విశిష్ట గుర్తింపు సంఖ్యను తప్పనిసరిగా పొందితేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు అందుతాయని క్రోసూరు ఏడీఏ వీ హనుమంతరావు అన్నారు. పీఎం కిసాన్ యోజన, పంట రుణాలపై వడ్డీ రాయితీ, క్రాపు ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ, అన్నదాత సుఖీభవ, రాయితీపై యంత్ర పరికరాలు, సూక్ష్మ నీటి సేద్య పరికరాలు మొదలైనవి విశిష్ట గుర్తింపు సంఖ్య ఉంటేనే లభిస్తాయన్నారు. శనివారం పీసపాడులో జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన రైతులతో మాట్లాడారు. రైతులందరూ పట్టాదారు పాసు పుస్తకం నకలు, ఆధార్ కార్డు నకలు, ఆధార్ కార్డుకు లింకైన ఫోన్ తీసుకొని రైతు సేవా కేంద్రాలకు వస్తే నమోదు జరుగుతుందని, ఫోన్‌కు మూడు సార్లు ఓటీపీ వస్తుందని, ఆ వెంటనే విశిష్ట గుర్తింపు సంఖ్య వెలువడుతుందని ఆయన తెలిపారు. రైతులందరూ వీలైనంత త్వరగా ఈ గుర్తింపు సంఖ్యను పొందాలని కోరారు. పీసపాడు రైతు సేవా కేంద్రంలో రైతుల రిజిస్ట్రేషన్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వీ వేణు గోపాల్, రైతు సేవా కేంద్రం సిబ్బంది పవన్ కుమార్, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

నకరికల్లు, (ఆంధ్రజ్యోతి) : పొలం ఉన్న ప్రతి ఒక్క రైతు రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించు కోని విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలని ఏవో కె.దేవదాసు కోరారు. శనివారం నకరికల్లులో ఏవో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, సున్నావడ్డీ వంటి పథకాలు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందిన రైతులకే వరిస్తాయన్నారు. విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలంటే రైతులు వారి ఆధార్ కార్డు జిరాక్స్, పొలం పాసు బుక్ జిరాక్స్ 1బీ, ఆధార్ కార్డుకు లింకైన మొబైల్ నెంబరుతో రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించు కోవాలని తెలియజేశారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహా శివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష

అమరావతి, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి) ఈనెల 26న మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని అమరావతి సందర్శించే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు సమన్వయ సహకారంతో పని చేయాలని తహశీల్దార్ డానియేలు కోరారు. శనివారం అమరేశ్వరాలయ ప్రాంగణములో జరిగిన మహాశివరాత్రి రెండవ సమీక్షా సమావేశానికి తహసీల్దార్ అధ్యక్షత వహించగా ఈవో పి సునీల్‌కుమార్, సీఐ అచ్చయ్యలు హాజరయ్యారు. సమీక్షలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులతో వారు మాట్లాడుతూ శివరాత్రి ఉత్సవాలకు తీసుకునే ఏర్పాట్లకు సంబందించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో విద్యుత్, ఎక్సైజ్, ఫిషరీస్, ఫైర్, ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, పోలీసు, హెల్త్, పంచాయితీరాజ్ తదితర శాఖల అధికారులు హాజరయ్యారు. మళ్లీ ఈనెల 25న మూడవ దఫా సమీక్ష ఆర్డీవో అధ్యక్షతన జరుగుతుందని తహసీల్దార్ డానియేలు తెలియజేశారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కేతినేని అగస్టీన్, ఉపాధ్యక్షులు షేక్ కరిముల్లాలు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం రాత్రి సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరు లసమావేశంలో వారు మాట్లాడుతూ బాధితుల పక్షాన సీపీఐ మొదటి నుంచి పోరాడుతుందన్నారు. బాధితులకు న్యాయం చేస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు.



సీఎం చంద్రబాబునాయుడుతో మాట్లాడుతున్న రైతులు



సీఎం చంద్రబాబునాయుడుకు వినతి పత్రం అందజేస్తున్న వేగుంట రాణి

ముఖ్యమంత్రికి వినతి

అమరావతి, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని వైకుంఠపురం, ఎండ్రాయి, కర్లపూడి గ్రామాలకు చెందిన పలువురు రైతులు శనివారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని కలిశారు. తమ గ్రామాలపరిధిలో ఏర్పాటుచేయనున్న రైల్వేలైనుకి సంబంధించి సేకరించాల్సిన భూములను ల్యాండ్ పూలింగ్ ద్వారానే తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈవిషయంపై సీఎం స్పందిస్తూ ఈ విషయంపై మంత్రి నారాయణ, సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబుతో మాట్లాడానని, వారిని కలవాలని రైతులకు సూచించారు. అలాగే ఏవిషయంలోనూ ఎవరికీ అన్యాయం జరుగదని, ఆందోళన చెందవద్దని తమకు భరోసా ఇచ్చినట్లు రైతులు తెలియజేశారు.

క్రోసూరు,(ఆంధ్రజ్యోతి): మహిళలకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్య ఇవ్వాలని, మార్కెట్ యార్డులు, కార్పొరేషన్ పదవుల్లో మహిళా ప్రాతినిధ్యం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర తెలుగు మహిళా అధికార ప్రతినిధి వేగుంట రాణి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. ఈ మేరకు ఆమె శనివారం రాష్ట్ర సచివాలయంలో సీఎంని కలిసి వినతిపత్రం అందజేశారు.



బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి శని వారం సత్తెనపల్లి మండలంలో ఒక శుభ కార్యానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఏలూరి శశికుమార్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కట్టా శంకరరావులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. - సత్తెనపల్లి



కస్తల గ్రామంలో పట్ట భద్రులను కలసి ఓట్లు అభ్యర్థిస్తున్న మాజీ ఎమ్మెల్యే, జిల్లా టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్

ఆలపాటి రాజాను గెలిపించాలి

- మాజీ ఎమ్మెల్యే, పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి
- వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారాలు

అచ్చంపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో ఆలపాటి రాజాను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే, పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. శనివారం కస్తల గ్రామంలో ఆయన పర్యటించి ఎమ్మెల్సీ ఓట్లపై పట్టభద్రులకు అవగాహన కల్పించారు. మొదటి ప్రాధాన్యత ఓటును ఆలపాటి రాజాకు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గ్రామంలో కోరారు. కార్యక్రమంలో సంగం డెయిరీ మాజీ చైర్మన్ కిలారి రాజన్‌బాబు, ఎన్నికల పరిశీలకుడు నల్లపాటి రాము, టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, కోటయ్య పాల్గొన్నారు.

మండలంలోని అంబడిపూడి గ్రామంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు పారుపల్లి స్వామి ఆధ్వర్యంలో ఆలపాటి రాజాను గెలిపించాలంటూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల వద్దకు వెళ్ళి రాజాకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మచ్చా నవీన్, కొమ్మవరపు దిబ్బయ్య, కే గంగయ్య, కే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని కోనూరు గ్రామంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు పట్ట భద్రులను కలసి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కే ఓటు వేయాలనికోరారు. అచ్చంపేటలో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు నల్లపాటి రాము ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలువురు పట్ట భద్రలను కలిసి ఆలపాటి రాజాకు ఓటు వేయాలని కోరారు.

క్రోసూరు,(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు జిల్లా పరిషత్ హైస్కూళ్ళల్లో కృష్ణా, గుంటూరు జిల్లాల పట్ట భద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కి ఓటు వేసి గెలిపించాలని కోరుతూ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాంద్రు కాశయ్య స్థానిక టీడీపీ నేతలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులను కలుసుకొని ప్రచార కరపత్రాలను అందజేసి ప్రథమ ప్రాధాన్యత ఓటు ఆలపాటికి వేసి విజయం చేకూర్చాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనుమాల పూర్ణ, దుద్దుల యోహాన్, ఊరే రోశయ్య, ఏపూరి గోవిందరావు, వందిటి రత్నం తదితరులు పాల్గొన్నారు.

బెల్లంకొండ, (ఆంధ్రజ్యోతి) : కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాదు గెలుపే ధ్యేయంగా పని చేయాలని నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు హనుమంతరావు నాయక్ పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం బెల్లంకొండ మండలంలోని న్యూచిట్యాల ఆర్‌అండ్‌ఆర్ సెంటర్ టీడీపీ కార్యాయలంలో నాయకులు, కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. టీడీపీ నాయకులు ఆయా గ్రామాల్లో ఉన్న పట్ట భద్రుల ఓటర్లను కలసి ఆలపాటికి ఓటు వేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు నాగమణి బాయి, ఎస్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పెదకూరపాడులో విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందించిన పూర్వ విద్యార్థులు

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం..

పెదకూరపాడు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : పెదకూరపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1985-86వ సంవత్సరం 10వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని శనివారం పాఠశాలలో నిర్వహించారు. ఒకరితో ఒకరు ఆత్మీయ చిరు నివ్వుల పలకరింపుతో సందడి చేశారు. యోగ క్షేమాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు 20 మంది విద్యార్థులకు రూ.72 వేల నగదుని స్కాలర్‌షిప్‌గా పంపిణీ చేశారు.

కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎన్ఆర్ఐ బాలినేని రామకృష్ణ, కొర్లకుంట సుబ్బారావు, మోదేపల్లి రమాదేవి, బాలినేని రామకృష్ణ, రావూరి విశ్వనాథ శర్మ, తన్నీరు హరి ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.


ముగిసిన పోషణ భీ - పడాయి భీ శిక్షణ

క్రోసూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : క్రోసూరులోని ప్రభుత్వ మోడల్ స్కూల్లో మూడు రోజులుగా జరుగుతున్న పోషణ భీ.. పడాయి భీ శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ బాలత్రిపుర సుందరి మాట్లాడుతూ ఆరు సంవత్సరాల లోపు పిల్లల్లో శారీరక అంగ వైకల్యాల్లో రకాలను ఏ విధంగా గుర్తించాలి, దివ్యాంగులను స్క్రీనింగ్ చేసే విధానం, మేధో వైకల్యాలు, రక్త రుగ్మతలు, పిల్లల ప్రవర్తన తదితర విషయాల గురించి వివరించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను అమలు చేయాలని ఆమె కోరారు. శిక్షణలో అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు వణుకూరి మాధవి, షైక్ మున్నీసా తదితరులు పాల్గొన్నారు.

నకరికల్లు,(ఆంధ్రజ్యోతి): నకరికల్లు, కండ్లకుంట హైస్కూళ్లలో పోషణభీ.పడాయిభీ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్లు రమీజాన్, ఆనందకుమారి, నాగమణి, సీడీపీవో శ్రీలత, ఏసీడీపీవో సంతోషి కుమారి ఈ కార్యక్రమం గురించి అంగన్‌వాడీలకు వివరించారు.

బెల్లంకొండ, (ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ జడ్పీ హైస్కూల్ ఆవరణలో ఆదివారం అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలకు నిర్వహిస్తున్న పోషణభీ.. పడాయి భీ శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసినట్లు సూపర్‌వైజర్లు పరిమళ, వనజ తెలిపారు. మొదటి రోజు అంగన్‌వాడీలో విద్యా కార్యక్రమాల గురించి, రెండవరోజు పౌష్టికాహారం గురించి, మూడవ రోజు ఆరు సంవత్సరాలలోపు పిల్లల, దివ్యాంగుల గురించి ఇవ్వాల్సిన పోషకాహారం, సౌకర్యాల గురించి అంగన్‌వాడీ టీచర్లకు, కార్యకర్తలకు వివరించామన్నారు.

అచ్చంపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఆరు సంవత్సరాల లోపు పిల్లల్లో శారీరక, మానసిక అంగ వైకల్యాలను ఏ విధంగా గుర్తించాలనేది అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణను ఇచ్చినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్.మాణిక్యం అన్నారు. రెండు రోజులుగా జరుగుతున్న శిక్షణాకార్యక్రమం మూడో రోజు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ దివ్యాంగుల స్క్రీనింగ్ టెస్ట్ గురించి అవగాహన కల్పించామన్నారు. ప్రారంభబాల్య ప్రేరణలు, గృహ సందర్శనలు, దివ్యాంగులను ఏ విధంగా సంరక్షించాలి? అనే వాటిపై శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఆమెతో పాటు రత్నకుమారి ఉన్నారు



క్రోసూరులోని ప్రభుత్వ మోడల్ స్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న అంగన్ వాడీ టీచర్లు

- మిర్చియార్డులో ఎవరి వాదన వారిది
- మిర్చి ధర పెంచడం లేదని రైతుల ఆరోపణ
- మిర్చి నాణ్యత బాగోకపోవడం వలనేనంటున్న వ్యాపారులు
- నిస్సహాయ స్థితిలో గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ

ధరపై.. దిగాలు





రైతులు తీసుకొచ్చిన మిర్చిలో తేమ శాతం ఎక్కువగా ఉండటంతో యార్డులోనే ఎండబెడుతున్న వ్యాపారులు

గుంటూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో 30 శాతం కూడా వ్యాపారం జరగని తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీలో మిర్చి ధర రోజు రోజుకూ పెరుగుతున్నది. మరోవైపు పేరుకు ఆసియా ఖండంలోనే అతి పెద్ద మిర్చియార్డుగా పేరుగాంచిన గుంటూరు ఏఎంసీలో మాత్రం ధర పెరగడం లేదు. కొనుగోళ్లు జరుగుతున్నా రైతులు ఆశించిన ధర రాకపోతుండటంతో దిగాలు చెందుతున్నారు. ఇందుకు ఇటు రైతులు, అటు వ్యాపారులు భిన్నమైన వాదనలు వినిపిస్తున్నారు. తాము తీసుకొచ్చిన మిర్చికి నాణ్యత లేదని, కాయ సైజు తక్కువగా ఉందని, తేమ శాతం అధికంగా ఉందని చెప్పి వ్యాపారులు రేటు తగ్గిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కాగా రైతులు తీసుకొస్తున్న మిర్చి రంగు బాగుండాలని కొంతమంది నీళ్లు స్ప్రే చేయడం, బాగా ఎండకుండానే మెతకగా ఉన్న తరుణంలోనే తీసుకొస్తుండటం వలన ఎక్స్‌పోర్టర్లు ధర పెంచడానికి ఆసక్తి చూపడం లేదని కమీషన్ వ్యాపారులు చెబుతున్నారు. ఖమ్మం మార్కెట్‌లోకి వస్తున్న మిర్చి క్వాలిటీగా ఉంటుండటంతో అక్కడ క్వింటాల్‌కు రూ. 500 నుంచి రూ. 1000 వరకు అధిక ధర పెట్టి కొనుగోలు చేస్తున్నారని పేర్కొంటున్నారు.

గుంటూరు మిర్చియార్డులో సీజన్ మొదలై ఇప్పటికే నెలన్నర దాటిపోయింది. అయినప్పటికీ క్వింటాల్ మిర్చి రూ. 13 వేల నుంచి రూ. 13,500 వద్దనే కొనసాగుతున్నది. మరోవైపు ఖమ్మం మార్కెట్ యార్డులో గత వారం తేజ క్వాలిటీ మిర్చి క్వింటాల్ రూ. 14,500కు చేరింది. అక్కడ ఇంకా ధర పెరిగేందుకు ఆస్కారం ఉందని ఇక్కడి ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అక్కడికి వస్తున్న మిర్చి క్వాలిటీతో పాటు హమాలీ, లారీ కిరాయి ఛార్జీలు తక్కువగా ఉండటం కూడా వ్యాపారస్తులు ఎక్కువ ధర పెట్టి కొనుగోలు చేయడానికి ఒక కారణంగా ఉన్నది. మరోవైపు గుంటూరు మిర్చియార్డులో సిండికేట్లదే రాజ్యం. యార్డులో రైతు అడుగు పెట్టినప్పటి నుంచి పీక్కు తినేందుకు ప్రయత్నిస్తుంటారు. ఎన్ని ఆదేశాలు ఇస్తున్నా లాట్ల నుంచి మచ్చుకాయలు తీయడం ఆపడం లేదు. కమీషన్ వ్యాపారుల దుకాణాల వద్దనే ఈ తతంగం జరుగుతున్నది. ముఠావర్కర్లు ఒకపక్క హమాలీ ఛార్జీలు తీసుకొంటూనే మరోవైపు కేజీలకు కేజీల మిరపకాయలను తీసుకొంటుండటం వలన రైతుకు ప్రత్యక్షంగానే నష్టం జరుగుతున్నది.

రైతులు... ఇలా చేయండి

మిర్చియార్డుకు రైతులు తమ మిరపకాయలను తీసుకొచ్చేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటించాలి. సైజుల వారీగా ముందుగానే గ్రేడింగ్ చేసుకొంటే మంచిది. కాయ మెతకగా ఉన్నప్పుడు తీసుకురావొద్దు. కల్లాల్లో బాగా ఎండబెట్టి తీసుకురావాలి. ఎట్టిపరిస్థితుల్లో తూకం పెరగాలని మిర్చి టిక్కీలకు నీళ్లు వెదజల్లొద్దు. రంగు, సైజు, బాగా ఎండి ఉంటే కచ్చితంగా వ్యాపారుల నుంచి పోటీ ఉంటుంది. అప్పుడు రైతు తనకు ఇష్టమైన ధరకు అమ్ముకోవచ్చు. ప్రస్తుతం కొనుగోళ్లు బాగా జరుగుతున్నందున కొంచెం క్వాలిటీ మిరపకాయలు తీసుకొస్తే ధర క్వింటాల్ రూ. 15 వేలు దాటడానికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. క్వాలిటీ తీసుకొచ్చినా ధర పెంచకపోతే అప్పుడు వ్యాపారులను నిలదీయొచ్చు. మార్కెట్ కమిటీకి కూడా ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుంది.

నాణ్యతకు కొలమానం ఎలా?

గతంలో మిర్చియార్డులో ఒక లేబొరేటరీ ఉండేది. అక్కడ రైతులు ఎవరైనా మిర్చిని తీసుకొస్తే రంగు, సైజు వంటివి పరీక్షించి సర్టిఫికేట్ ఇచ్చేవారు. దాంతో వ్యాపారులు ఆ సర్టిఫికేట్ ఆధారంగా ధర అధికంగా చెల్లించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి ఏ కోశాన కనిపించడం లేదు. అసలు రైతులు తీసుకొస్తున్న నాణ్యతని కొలమానం చేసే వారెవరూ లేరు. దాంతో వ్యాపారులు చెప్పిన మాటే వినాల్సిన పరిస్థితి ఏర్పడింది.

గ్రిడ్ అనుసంధానంపై.. అధ్యయనం

(5వ పేజీ తరువాయి)

కానున్నారు. వాటర్ గ్రిడ్‌కు తుదిరూపు ఇవ్వనున్నారు. పల్లెల కోసం వాటర్ గ్రిడ్ చేపట్టగా దీనిని పట్టణాలకు అనుసంధానం చేస్తుండటంతో పథక వ్యయ అంచనాలను మళ్లీ రూపొందిస్తున్నారు. ఈ నివేదికలను ప్రభుత్వానికి అందిస్తారు. సీఎం నారా చంద్రబాబు వాటర్ గ్రిడ్‌పై ఇంజనీర్లతో రానున్న వారంలో సమీక్షించనున్నట్లు అధికారులు తెలిపారు.

నిలిచిన పనులకూ అంచనాలు

మున్సిపల్ పట్టణాల్లో తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు అమృత్ 2.0 పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆయా పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఇక పల్నాడు జిల్లాలోనూ గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన వాటర్ గ్రిడ్ పథకానికీ వైసీపీ ప్రభుత్వ హయాంలో నిధులు విడుదల చేయలేదు. ఈ పథకాన్ని అటకెక్కించింది. ఈ పరిస్థితుల్లో అటు అమృత్, ఇటు వాటర్‌గ్రిడ్ పథకాల్లో నిలిచిపోయిన పనులు తిరిగి చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం వ్యయ అంచ నాలను రూపొందించింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపాల్టీలలో నిలిచిపోయిన పనులు చేపట్టేందుకు తాజాగా డీపీఆర్‌లను రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ ఆమోదించింది. కేంద్రం, రాష్ట్రప్రభుత్వం, మున్సిపాల్టీలు దామాషా ప్రకారం నిధులు సమకూర్చనున్నాయి. రూ.783.39 కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రణాళికలు కూడా సిద్ధమయ్యాయి. ఈ పనులు అమృత్ నిధులతో చేపడతారు. అయితే అమృత్ పనులను వాటర్ గ్రిడ్‌కు అనుసంధానం చేసి అటు పల్లెల్లో, ఇటు మున్సిపల్ పట్టణాల్లో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ప్రభుత్వం నిర్ణయించి ఆ దిశగా అధ్యయనానికి అధికారులను ఆదేశించింది. సాగర్ నుంచి ఏ ప్రాంతానికి ఎంత సామర్థ్యం కలిగిన పైపులైన్లు అవసరమో అధికారులు నిర్ధారిస్తారు.



సాగర్ నుంచి కుడి కాలువకు నీటి సరఫరా

అమృత్.. జలజీవన్ మిషన్ నిధులు అందుబాటులో..

వాటర్ గ్రిడ్‌కు అమృత్ 2.0 జలజీవన్ మిషన్ పథకం నుంచి నిధులు సమకూరనున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఈ పథకాలకు పెద్దపీట వేస్తోంది. జలజీవన్‌ను 2028 వరకు పొడిగించింది. మున్సిపాల్టీలకు అమృత్ పథకం కింద నిధులు మంజూరు చేసింది. పట్టణాల్లో అమృత్ కింద రూ.783.39 కోట్లతో డీపీఆర్‌లు సిద్ధం చేశారు. ప్రతి మున్సిపాల్టీలో నీటి పథకాలను అభివృద్ధి చేయాల్సి ఉండగా వాటర్ గ్రిడ్ వల్ల వ్యయం తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. ఈ నిధులను వాటర్ గ్రిడ్‌కు మళ్లించేందుకు చర్యలు చేపడుతున్నారు. వాటర్ గ్రిడ్‌తో పట్టణాలు, పల్లెల్లో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

గ్రూపు-2 పరీక్ష... పకడ్బందీగా నిర్వహించాలి

● జేసీ భార్గవ తేజ

గుంటూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ వారు గ్రూప్-2 సర్వీసెస్(నోటిఫికేషన్ నం. 11/2023) ఉద్యోగాల నియామకానికి సంబంధించిన మెయిన్స్ పరీక్షని పకడ్బందీగా నిర్వహించాలని పరీక్షల కో-ఆర్డినేటింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ అమలినేని భార్గవ తేజ ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ఎస్‌కే ఖాజావలితో కలిసి పరీక్షల లైజను ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ గ్రూపు-2 మెయిన్స్ పరీక్ష ఈ నెల 23వ తేదీ(ఆదివారం) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు(పేపర్-1), మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు(పేపర్-2) పరీక్ష జరుగుతుందన్నారు. జిల్లాలో 11 పరీక్ష కేంద్రాలలో ఈ పరీక్షలు జరుగుతాయని చెప్పారు. మొత్తం 9,277 మంది అభ్యర్థులు హాజరు అవుతారని తెలిపారు. జిల్లాలోని 11 పరీక్ష కేంద్రాలకు సీనియర్ జిల్లా అధికారులను లైజను ఆఫీసర్లుగా నియమించడం జరిగిందన్నారు. ప్రతి అధికారిని తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాన్ని సందర్శించి అక్కడ చీఫ్ సూపరింటెండెంట్, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పరీక్ష నిర్వహణ సజావుగా జరిపించేందుకు తీసుకొనవలసిన జాగ్రత్తలు తెలియజేయాలన్నారు. ఈ నెల 21వ తేదీన మరోసారి ఏపీపీఎస్సీ అధికారులతో పరీక్ష కేంద్ర చీఫ్ సూపరింటెండెంట్‌లు, లైజను ఆఫీసర్లు, పోలీసు, విద్యుత్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ తదితర లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో సమావేశం నిర్వహిస్తామన్నారు.



కలెక్టరేట్‌లో గ్రూపు-2 పరీక్షల నిర్వహణపై లైజన్ అధికారులతో సమావేశమైన జేసీ భార్గవ తేజ

ప్రభుత్వ పాఠశాలల్ని బలోపేతం చేయాలి

● పాఠశాల విద్యాశాఖ అదనపు డైరెక్టర్ పార్వతి

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్ని మరింత బలోపేతం చేసేలా ఉపాధ్యాయులు పనిచేయాలని పాఠశాల విద్యాశాఖ అదనపు డైరెక్టర్ పీ పార్వతి సూచించారు. శనివారం పాతబస్టాండు వద్ద ఉన్న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన క్లస్టర్ సమావేశంలో ఆమె మాట్లాడారు. గుంటూరు జిల్లాలో 64 క్లస్టర్స్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు గ్రేడింగ్ ఇవ్వడంతోపాటు వారి నైపుణ్యాలను విశ్లేషిస్తామని వివరించారు. పాఠశాలల్లో సకాలంలో సిలబస్ పూర్తిచేయడం, కష్టమైన చాప్టర్స్ బోధన మరింత సమగ్రంగా వివరించడం, పాఠ్యప్రణాళిక, వినూత్నబోధనా పద్ధతుల్ని తీసుకుస్తామన్నారు. విద్యార్థులకు మెరుగైన బోధన అందించడంతోపాటు వారిలో నైపుణ్యాలు పెంపొందించేలా కృషి చేస్తామన్నారు. డీఈవో సీవీ రేణుక మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్ని బలోపేతం చేయాల్సిన సమష్టిబాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ నోడల్ ఆఫీసర్లు అబ్దుల్ ఖుద్దూస్, ఎండీ ఖాసిం, హెచ్ఎం వసుంధర తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాఠశాల విద్య అదనపు డైరెక్టర్ పార్వతి

హైకోర్టు ఏజీపీగా నంద నాగ రవిశంకర్ నియామకం



గుంటూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెం వాసి ముప్పాళ్ళ నంద నాగ రవిశంకర్‌ను హైకోర్టు ఏజీపీగా నియమించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున హైకోర్టులో వాదనలు వినిపించేందుకు న్యాయవాది ముప్పాళ్ళ నంద నాగ రవిశంకర్‌ను ఏజీపీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఏజీపీ రవిశంకర్ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్‌కు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు రవిశంకర్‌కు శుభాకాంక్షలు చెప్పారు.

ఎన్నికల డ్యూటీ ఉద్యోగులకు.. శివరాత్రి లేనట్లే

- 26న మహా శివరాత్రి పర్వదినం
- ఇదే రోజున డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పోలింగ్ సామగ్రి పంపిణీ

గుంటూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పండగ ప్రభుత్వ కార్యాలయాలకు సెలవుదినం అయినప్పటికీ ఆ రోజున కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం ఎన్నికల విధులు నిర్వహించాల్సిన సిబ్బందికి వర్కింగ్ డేనే. ఇందుకు కారణం శివరాత్రి పండగ మరుసటి రోజునే పోలింగ్ తేదీ కావడం. దీని దృష్ట్యా ముందురోజునే డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు ఉదయాన్నే అధికారులు, సిబ్బంది చేరుకుని పోలింగ్ సామాగ్రిని తీసుకొని వారికి కేటాయించిన రూట్లలో బూత్‌లకు చేరుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో వేల మంది ఉద్యోగులకు పండగ సెలవుదినం ఈ సారి లేనట్లే. దీంతో వారంతా అసంతృప్తికి గురౌతున్నారు.

ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 27వ తేదీన గురువారం పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ జరగాల్సి ఉంది. ఈ కారణంగా ముందురోజు ఈ నెల 26వ తేదీ బుధవారం ఉదయం 8 గంటలకల్లా ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ అధికారులు, బందోబస్తులో పాల్గొనే పోలీసు సిబ్బంది, నోడల్ అధికారులు గుంటూరు నగరంలోని ఏసీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు రావాలి. అక్కడ ఏర్పాటు చేసే కౌంటర్ల వద్ద పోలింగ్ సామాగ్రిని తీసుకుని బస్సుల్లో రూట్ల వారీగా పోలింగ్ కేంద్రాలకు చేరుకుని అక్కడే బస చేయాలి. 26వ తేదీనే ఈ సంవత్సరం మహా శివరాత్రి పర్వదినం వచ్చింది. ఈ విషయాన్ని ఎన్నికల సంఘం అంతగా పరిగణనలోకి తీసుకోలేదు. ఈ నేపథ్యంలో తమకు శివరాత్రి పండగ లేనట్లేనని డ్యూటీలు పడిన వారిలో చాలామంది అసంతృప్తికి లోనౌతున్నారు.

పోలింగ్ విధులకు గుంటూరులో 1867 మంది అధికారులు, సిబ్బంది

ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 483 పోలింగ్ బూత్‌లున్నాయి. ఒక్క గుంటూరు జిల్లాలోనే 185మంది పీవోలు, 185 మంది ఏపీవోలు, 379 మంది ఓపీవోలు, 178 మంది మైక్రో అబ్జర్వర్లు, 26 మంది సెక్టోరల్, మరో 26 మంది రూట్ ఆఫీసర్లు ఉన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు 888 మంది పోలీసు సిబ్బందిని నియమించారు. మొత్తంగా 1867 మంది గుంటూరు జిల్లాలో ఉన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు పరిశుభ్రం

- 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర'లో చీపుర్లు పట్టిన అధికారులు
- చెత్తా, చెదారానికి మోక్షం

గుంటూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ప్రాంగణం మొత్తాన్ని స్వచ్ఛ ప్రదేశంగా మారుద్దామని ఉద్యోగులతో జాయింట్ కలెక్టర్ అమిలినేని భార్గవ తేజ ప్రతిజ్ఞ చేయించారు. శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో ఉద్యోగులతో కలిసి జేసీ శ్రమదానం నిర్వహించారు. కలెక్టరేట్‌లో పేరుకుపోయిన చెత్తా, చెదారాన్ని ఎత్తి డంపర్‌బిన్‌లలో పోసి బయటకు తరలించారు. అనంతరం పలుచోట్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ నెలలో ప్రతి మూడో శనివారం ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహణకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. అయితే ఆ రోజు వరకు నిరీక్షించకుండా కలెక్టరేట్‌లో ఎక్కడ పడితే అక్కడ చెత్తని పడేయకుండా ఉద్యోగులు, సందర్శకులు స్వీయ నియంత్రణ పాటించాలన్నారు. డస్టుబిన్‌లలోనే చెత్తని వేయాలన్నారు. దీనివలన పరిసరాలు పరిశుభ్రంగా ఉండటంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ఎస్‌కే ఖాజావలి, కలెక్టరేట్ ఏవో పూర్ణ చంద్రరావు, మత్స్య శాఖ డీడీ గాలిదేముడు, డీపీవో సాయికుమార్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవీందర్, జిల్లా భూగర్భ జలవనరుల శాఖ ఉప సంచాలకులు వందనం, కలెక్టరేట్ సెక్షన్ సూపరిండెంట్‌లు, అధికారులు పాల్గొన్నారు.

జడ్పీలో...

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర పుణ్యామా అని ప్రభుత్వ కార్యాలయాలు బాగుపడుతున్నాయి. ప్రతి నెల మూడో శనివారం రోజున అధికారులు చీపుర్లు పట్టుకోవటంతో కార్యాలయాల్లో పేరుకుపోయిన చెత్తా, చెదారానికి మోక్షం కలుగుతుంది. గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో సీఈవో వి.జ్యోతిబసు ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది. సీఈవోతోపాటు ఆయా సెక్షన్ల సూపరింటెండెంట్లు పారిశుధ్య పనుల్లో భాగస్వాము లయ్యారు. జిల్లా పరిషత్‌లో జరిగిన కార్యక్రమంలో అకౌంట్స్ ఆఫీసర్ శామ్యూల్ పాల్, సెక్షన్ల సూపరింటెండెంట్లు పూర్ణ చంద్రారెడ్డి, మల్లేశ్వరరావు, పీఆర్ యూనియన్ రాష్ట్ర నేత డాక్టర్ కూచిపూడి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ డివిజన్ ప్రత్తిపాడు కార్యాలయంలో జరిగిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో డీఈ జె.భానుప్రకాష్, సీనియర్ అసిస్టెంట్‌లు ఎం. ప్రశాంతి, గుంటుపల్లి శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ ఏఎస్ చక్రవర్తి, జేటీవో పీఎస్వీఎస్ ఎస్.ప్రసాద్, పి.శారదాదేవి తదితరులు పాల్గొన్నారు.



జెడ్పీలో చీపురుతో చెత్త పోగు చేస్తున్న సీఈవో జ్యోతి బసు తదితరులు



కలెక్టరేట్‌లో శ్రమదానం నిర్వహిస్తున్న జేసీ భార్గవ తేజ, డీఆర్‌వో ఖాజావలి

పోషణ.. అంతంతే

(5వ పేజీ తరువాయి)

సిబ్బంది కేంద్రంలో ఉన్న చిన్నారుల సంఖ్య, కొత్తగా చేరినవారి సంఖ్య ఆధారంగా 45 రోజులకు సరిపడా ఇండెంట్ ఇచ్చేవారు. అలా 15 రోజుల సరుకులు అదనంగా ఉండడంతో కొత్తగా చేరిన వారికి చేరిన రోజు నుంచే పోషణ అందేది. ఆ పరిస్థితి ఇప్పుడు లేకుండాపోయింది.

● నెలాఖరుకు పాలు..

అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతి నెలా మొదటి వారంలో లబ్ధిదారులకు సరుకులు అందిస్తున్నారు. పాలు మాత్రం నెలాఖరు వరకూ రావడం లేదు. అన్ని సరుకులతోపాటు పాలు ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ప్రతి నెలా గుడ్ల సంఖ్య తగ్గుతోంది. గుడ్ల ధరల్లో వచ్చే మార్పును బట్టి గుడ్ల సరఫరా జరుగుతోందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. కాంట్రాక్టు సంస్థ ధర, రవాణా వ్యయంను బట్టి గుడ్ల సంఖ్యను తగ్గిస్తోందని సిబ్బంది చెబుతున్నారు. ధర పెరిగిన ప్రతి సందర్భంలో గుడ్ల సంఖ్య తగ్గిపోతోందని, ఆ కారణంగా వచ్చిన వాటినే అందరికీ సరిపెడుతున్నామని చెబుతున్నారు.

యాప్‌లను బట్టే ఇండెంట్..

ప్రభుత్వం నిర్వహిస్తున్న యాప్‌లలో నమోదైన వారి సంఖ్య ఆధారంగా ఇండెంట్ ఇస్తున్నాం. నమోదు కానివారికి సరుకులు రావు. అంగన్వాడీ సిబ్బంది ఈ విషయంలో శ్రద్ధ తీసుకోవాలి. వారు సక్రమంగా నమోదు చేస్తే అందరికీ సరుకులు వస్తాయి. సిబ్బంది యాప్‌లను సక్రమంగా నిర్వహించాలి.

-కేవీఎస్.విజయలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ, గుంటూరు

ప్లాస్టిక్ రహిత విశ్వవిద్యాలయంగా ఏఎన్‌యూ

పెదకాకాని, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో శనివారం స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్సిటీ జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు పర్యవేక్షణలో ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్లాస్టిక్ నిర్మూలన కార్యక్రమం చేపట్టారు. కళాశాల పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్, వర్సిటీ స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర నోడల్ ఆఫీసర్ ఆచార్య వి.దివ్య తేజో మూర్తి ఎన్ఎస్ఎస్ వలంటర్‌లను ఉద్దేశించి మాట్లాడారు. ప్లాస్టిక్ రహిత విశ్వవిద్యాలయంగా యూనివర్సిటీని తీర్చిదిద్దే క్రమంలో ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.గోపికృష్ణ, ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ సీహెచ్. రవికుమార్, డాక్టర్ సీహెచ్. ఉమాశంకర్, డాక్టర్ పి., యుగంధర్ రెడ్డి, 300 మంది వలంటీర్లు పాల్గొన్నారు. అనంతరం వలంటీర్లను ఇన్‌చార్జి రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, ఇన్‌చార్జి ఓఎస్‌డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ రవికుమార్ వలంటీర్లను అభినందించారు.



వర్సిటీలో ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



జగ్గాపురంలో విఘ్నేశ్వర, ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

శ్రీసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి శంకుస్థాపన

యడ్లపాడు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగ్గాపురంలో నూతనంగా నిర్మించనున్న శ్రీసిద్ధి వినాయకస్వామి దేవస్థాన నిర్మాణానికి భూమిపూజ, అభయాంజనేయస్వామి విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. గ్రామ ప్రారంభంలో సుమారు అర ఎకరం స్థలంలో ఈ దేవస్థానాన్ని నిర్మించనున్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పోపూరి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు ముద్దన నాగేశ్వరరావు, సర్పంచ్ ముద్దన తులిశమ్మ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు పోపూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచాలి



నూజెండ్ల మండల పరిషత్ కార్యాలయాన్ని శుభ్రం చేస్తున్న ఎంపీడీవో ఉమాదేవి, ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది

నూజెండ్ల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో పీ ఉమాదేవి అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఎంపీడీవో కార్యాలయం, పరిసరాలను శుభ్రం చేసి చెట్లు నాటడం, పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ అల్లాభక్షు, ఏపీవో ఆంజనేయరాజు, స్వచ్ఛ మండల కో-ఆర్డినేటర్ కంచర్ల సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా ఉద్యోగమేళా

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీఎన్‌సీ అండ్ కేఆర్ డిగ్రీ కళాశాలలో హైదరాబాద్ హెటిరో డ్రగ్స్ కంపెనీ నిర్వహించిన ఉద్యోగమేళా విజయవంతమైందని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎం ప్రేమ్‌చంద్ శనివారం తెలిపారు. ఉద్యోగమేళాకు నరసరావుపేట, చిలకలూరిపేట, తెనాలి, గుంటూరు పట్టణాలకు చెందిన బీఎస్సీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఐటీఐ ఫిట్టర్ పూర్తిచేసిన 70మంది విద్యార్థులు హాజరయ్యారు. కంపెనీ హెచ్‌ఆర్ సమీర్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రతిభకనబరిచిన 22మందిని కంపెనీలో ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.2.70లక్షలు వేతనంగా అందజేస్తారని ప్రిన్సిపాల్ జీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎంపికైనవారిని కళాశాల డైరెక్టర్ పాలడుగు శ్రీనివాసరావు, ప్లేస్‌మెంట్ అధికారి కే హరికృష్ణ, రమేష్, రేవతి అభినందించారు.

ఘనంగా ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): స్థానిక కేసానుపల్లిలోని ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు మాట్లాడుతూ విద్యార్థులు వేసే మొదటి అడుగు భవిష్యత్‌లో విజయాలకు దారితీసే మహత్తర ప్రయాణం కావాలని ఆకాంక్షించారు. ముఖ్యఅతిథి, జేకేసీ కళాశాల అధ్యాపకురాలు నాగసుశీల మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలో ఉన్న అవకాశాలను సరిగ్గా ఉపయోగించుకోవాలన్నారు. ఇంకా కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం ప్రసాదరావు మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర సాయిపవన్, లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీరబ్రహ్మంచౌదరి, కేఎస్‌పీఆర్ డైరెక్టర్ బీ కోటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో సమీక్ష

రొంపిచర్ల, ఫిబ్రవరి 15(ఆంధ్రజోతి): మండలంలోని రొంపిచర్ల, రెడ్డిపాలెం, సంతగుడిపాడు జడ్పీ పాఠశాలలు, మోడల్ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు శనివారం సమీక్ష జరిగింది. లాంగ్వేజ్, నాన్‌లాంగ్వేజెస్ గురించి వివరించారు. పలు పాఠశాలల్లో స్వచ్ఛత ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో బ్రహ్మేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్లకు ముగిసిన శిక్షణా తరగతులు

రొంపిచర్ల, ఫిబ్రవరి 15(ఆంధ్రజోతి): మండలంలోని రొంపిచర్ల, రెడ్డిపాలెం గ్రామాల్లో గల జడ్పీ పాఠశాలల్లో అంగన్‌వాడీ వర్కర్లకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా బోధన, పరిశీలన, సామార్థ్యాలను పటిష్టపరచటం వంటి వాటి గురించి సూపర్‌వైజర్లు శశిదేవి, దేవీ బాయి, షమీమ్ సుల్తానా వివరించారు. అదేవిధంగా స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. రెడ్డిపాలెం జడ్పీ పాఠశాలలో సీడీపీవో ఉమామహేశ్వరి పాల్గొన్నారు. శిక్షణలో వివరించిన అంశాలను ఆయా కేంద్రాల్లో అమలుపరచాలని తెలిపారు.

సంత్ సేవాలాల్ జయంతి నిర్వహించడం అభినందనీయం

వినుకొండ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సంత్‌సేవాలాల్ మహరాజ్ స్ఫూర్తిని నిలబెట్టేలా కూటమి ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తుందని నియోజకవర్గ టీడీపీ ఎస్టీ సెల్ నాయకులు హనుమానాయక్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి కార్యక్రమంలో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శనివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా హనుమానాయక్‌తో పాటు విష్ణునాయక్ మాట్లాడుతూ సేవాలాల్ జయంతిని అధికారికంగా చేపట్టడంపై సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీవీ సురేష్, టీడీపీ బొల్లాపల్లి మండల అధ్యక్షుడు జరపాల గోవిందునాయక్, పట్టణ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, రమణరావు, పెమ్మసాని నాగేశ్వరరావు, మస్తాన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరాంజనేయస్వామి దేవాలయ వార్షికోత్సవం

నాదెండ్ల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): గణపవరం గ్రామపరిధిలోని లింగంగుంట్ల, కావూరు మార్గమధ్యంలో ఉన్న వీరాంజనేయస్వామి దేవాలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఎంఎల్‌సీ మర్రి రాజశేఖర్‌లకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వీరితోపాటు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ, డీఎస్పీ నాగేశ్వరరావు, డీఆర్‌వో మురళీ, పీఆర్ ఎస్ఈ బ్రహ్మయ్య, రూరల్ సీఐ సుబ్బనాయుడు, కమిటీ అధ్యక్షులు కాట్రు శ్రీనివాసరావు, కార్యదర్శి ఆదిపూడి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలకు గురైన పంటకాల్వలను పునరుద్ధరించాలి

● ప్రజా సంఘాల నాయకుల డిమాండ్

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): వెంచర్లువేసి ఆక్రమించిన పంటకాల్వలను వెంటనే పునరుద్ధరించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో ప్రజాసంఘాల నాయకులు ప్రకాష్‌నగర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ విజయలక్ష్మి టౌన్‌షిప్, వేద మెడోస్ యజమానులైన గుండా సాంబశివరావు, అనిల్ తదితరులు పరారీలో ఉన్నారన్నారు. వారి వెంచర్లలో నెలరోజుల్లో ఆక్రమణలు తొలగిస్తామంటూ అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తక్షణమే ఎన్ఎస్‌పీ కాలువపై రోడ్డు నిర్మాణం, గార్డెన్ తొలగించాలని అధికారులను కోరారు. ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతం అవుతుంటే చూస్తూ ఊరుకోవటం సరికాదన్నారు. ములకలూరు, గోళ్ళపాడు మధ్యలో విజయలక్ష్మి టౌన్‌షిప్ పేరుతో వేసిన అనేక వెంచర్లలో వాగులు, ప్రభుత్వ పంటకాల్వలు, ఎన్ఎస్‌పీ కాల్వలు సైతం ఆక్రమించారని, వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీడీఎం నాయకులు షేక్ మస్తాన్‌వలి, జీ రామకృష్ణ, పౌరహక్కుల సంఘం జిల్లా సహాయకార్యదర్శి శిఖినం చిన్నా, నల్లపాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పీడీఎం, ఇతర ప్రజా సంఘాల నాయకులు

బంజారాల స్థిర నివాసానికి సేవాలాల్ మహరాజ్ కృషి

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



మాట్లాడుతున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పక్కన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ తదితరులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సద్గురు సేవాలాల్ మహరాజ్ సంచారజాతులుగా ఉన్న బంజారాలను అడవి ప్రాంతంలో తండాలుగా ఏర్పడి స్థిరనివాసం కోసం కృషిచేసిన మహనీయుడని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. శనివారం నరసరావుపేట షాదీఖానాలో సేవాలాల్ 286వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీ మాట్లాడుతూ బంజారాలు పశుపోషణ, వ్యవసాయం, నీటివనరులు పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారన్నారు. సేవాలాల్ స్ఫూర్తితో వరికపూడిశల ప్రాజెక్టు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తికావడానికి కృషిచేస్తామన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమానికి గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీ కోటనాయక్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బీ శ్రీనునాయక్, వీ రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.



వినుకొండలో పారిశుధ్య డబ్బాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ సుభాస్‌చంద్రబోస్

స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

వినుకొండ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): థీమ్ సోర్స్ సెగ్రిగేషన్ అవేర్నెస్ కాంపెయిన్ కార్యక్రమంలో భాగంగా 10వ వార్డులో పొడి, తడిచెత్తపై మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా 3వ శనివారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 36వ వార్డులో పారిశుధ్యంపై ప్రత్యేక కార్యక్రమంతో పాటు తడి, పొడిచెత్త, విషపదార్థాల వినియోగం తదితర అంశాలపై ప్రజలకు సూచనలు చేశారు. కార్యక్రమంలో భాగంగా ముండ్లమూరు బస్టాండ్ సమీపంలోని పబ్లిక్ టాయిలెట్స్‌ను ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు.

ఉమ్మడివరం గ్రామంలో....

స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉమ్మడివరంలో వ్యక్తిగత సోప్‌పిట్ నిర్మాణ కార్యక్రమాన్ని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధి లింగమూర్తి శనివారం పరిశీలించి సోప్‌పిట్ ఉపయోగాలను స్థానికులు వివరించారు. అనంతరం స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులచే ప్రతిజ్ఞ చేయించి గ్రామపరిశుభ్రతకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పుట్టారెడ్డి, పంచాయతీ సెక్రటరీ కృష్ణ, ఏపీవో కట్టా నాగేశ్వరావు పాల్గొన్నారు.

ఆలపాటికి మద్దతుగా ఎన్నికల ప్రచారం

ఈపూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు అన్నారు. ఈనెల 27వ తేదీన జరిగే కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో మొదటి ప్రాధాన్య ఓటు ఆలపాటికి వేసి గెలిపించాలన్నారు. శనివారం మండలంలోని అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి ఓటువేయాలని కోరారు. కార్యక్రమంలో అయినాల కోటేశ్వరరావు, సర్పంచ్ గోనుగుంట్ల శ్రీనివాసరావు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు

నేడు ఎమ్మెల్సీ ఎన్నికలపై సమన్వయ సమావేశం

వినుకొండ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం సాయంత్రం 3గంటలకు స్థానిక గంగినేని కల్యాణమండపంలో కూటమి నాయకుల సమావేశం నిర్వహిస్తున్నట్లు టీడీపీ స్థానిక నాయకులు తెలిపారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

● రీజినల్ మేనేజర్ మాధురి

ఈపూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు మెరుగైన సేవలందించి వారు ఆర్థికంగా వృద్ధి చెందేందుకు యూనియన్ బ్యాంకు తోడ్పాటునందిస్తుందని నరసరావుపేట రీజినల్ మేనేజర్ టీ మాధురి అన్నారు. ఈపూరు యూనియన్ బ్యాంకును శనివారం నూతన భవనంలోకి మార్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ పల్నాడు జిల్లాలోనే అధికంగా పంటరుణాలు ఈ బ్రాంచ్‌లో ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో మురళీమోహన్, చందన, సునీల్, ఈపూరు బ్రాంచ్ మేనేజర్ ఎం పార్థసారధి, ఆర్డీఓ హనిమిరెడ్డి పాల్గొన్నారు

మనసు అదుపునకు ఆధ్యాత్మికతను మించిన మార్గం లేదు

● ఎమ్మెల్యే జీవీ



కైలాశేశ్వర స్వామికి పూజలు చేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

వినుకొండటౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మాట, చేతలను అదుపులో ఉంచుకోవడానికి ఆధ్యాత్మికతను మించిన మార్గం మరొకటి లేదని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని శ్రీనివాస నగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీపరివార దేవతా సహిత గంగాగౌరీ సమేత కైలాశేశ్వస్వామి, కాళభైరవ, వినాయకుడు, అయ్యప్పస్వామి, కుమారస్వామి, అభయ ఆంజనేయస్వామి, జీవ ధ్వజస్తంభ ప్రతిష్ఠామహోత్సవాన్ని భక్తులు గత మూడురోజులుగా వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నసంతర్పణను జీవీ ప్రారంభించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాపభీతి, దైవచింతన ఉంటే జీవితంలో ఇబ్బందులుండవన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేపట్టిన అభివృద్ధి యజ్ఞానికి అందరి దేవుళ్ల ఆశీస్సులు పుష్కలంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆలయ స్థలదాత, కౌన్సిలర్ ఇందుమతి తోపాటు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రత్తిపాటి ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 8, 9 వార్డులలో ఉన్న సచివాలయాలు, శారద జిల్లా పరిషత్ హైస్కూల్, కావూరు హైస్కూల్, పలు ప్రభుత్వ కార్యాలయాలలోని గ్రాడ్యుయేట్ ఓటర్లను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం కలిసి కూటమి పార్టీల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఆలపాటికి ప్రథమ ప్రాధాన్య ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. విద్యార్థి దశ నుంచే ఆలపాటి రాజకీయాల్లో కీలకపాత్ర పోషించాడని, ఆ అనుభవం ప్రజాసంక్షేమానికి అన్నివిధాలా ఉపకరిస్తుందని ప్రత్తిపాటి చెప్పారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు తోట రాజారమేష్, జయరామిరెడ్డి, షేక్ కరిముల్లా, నెల్లూరి సదాశివరావు, పఠాన్ సమద్ ఖాన్, జవ్వాజి మదన్‌మోహన్, కామినేని సాయిబాబు, మద్దుమాల రవి పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత యోగ శిక్షణా తరగతులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 17నుంచి ఉచిత యోగ శిక్షణ తరగతులు నిర్వ హిస్తున్నమని జల్లి శ్రీనివాసరావు శనివారం తెలిపారు. స్థానిక రావిపాడు రోడ్డులోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో 28 రోజుల పాటు ఉదయం 5నుంచి 7 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. వివరాల కోసం 92471 91553 నంబరులో సంప్రదించాలన్నారు.

నాణ్యమైన ఆహారం, విద్యనందించడమే లక్ష్యం

● ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమాదేవి



శావల్యాపురంలో శిక్షణనిస్తున్న ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి

శావల్యాపురం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): అంగనవాడీ కేంద్రాల్లో ప్రతి బిడ్డకు నాణ్యమైన ఆహారంతోపాటు మంచి విద్యను అందించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నట్లు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమాదేవి అన్నారు. శావల్యాపురం జడ్పీపాఠశాలలో జరుగుతున్న పోషణ్‌బీ, పడాయిబీ శిక్షణ కార్యక్రమాన్ని ఆమె శనివారం తనిఖీ చేశారు. శిక్షణ తరగతుల్లో నేర్చుకొన్న అంశాలపై అంగనవాడీ కా ర్యకర్తలను పలు ప్రశ్నలడిగారు. పిల్లల్లో అభివృద్ధి నైపుణ్యాలపై అం గన్‌వాడీ కార్యకర్తలు తయారుచేసిన చార్ట్‌లు పరిశీలించారు. పీడీ మాట్లాడుతూ పౌష్టికాహార లోపాలను అధిగమించినపుడే గర్భిణీలు, బాలింతలు, చిన్నారులలో రక్తహీనత నివారణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో ముదివర్తి అనూరాధ, సూపర్‌వైజర్‌లు అరుణ, శ్రీలత, శివనాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో శారీరక, మానసిక పరివర్తనకు కృషి చేయాలి

వినుకొండటౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు తప్పనిసరిగా శారీరక, మానసిక ఎదుగుదలకు, కండరాల అభివృద్ధి, సృజనాత్మకతను వెలికితీసేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు కృషిచేయాలని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి తెలిపారు. స్థానిక గిరిజన గురుకుల పాఠశాలలో ఈ నెల 13నుంచి 15వ తేదీ వరకు జరిగిన అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె శనివారం మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ సెంటర్ల అభివృద్ధికి కృషిచేస్తుందన్నారు. కార్యక్రమంలో సీడీపీవో అనురాధ,సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ముగిసిన శిక్షణ

బొల్లాపల్లి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఈపూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న వెల్లటూరు, బొల్లాపల్లి సెక్టార్ పరి ధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ బీ, పడాయిబీపై మూడు రోజుల శిక్షణా కార్యక్రమం శనివారంతో ముగిసింది. వెల్లటూరు జడ్పీ హైస్కూల్లో ఈ కార్యక్రమం జరిగింది. చివరిరోజు సీడీపీవో అరుణ మాట్లాడుతూ చిన్నారుల వికాసానికి అంగన్‌వాడీ కార్యకర్తలు దోహదపడాలని కోరారు. ప్రతి చిన్నారి పాఠశాలల్లో చేరేలా చూడాలని, అంగన్‌వాడీ టీచర్లు పిల్లల్లో సమగ్ర అభివృద్ధికి సరైన విద్యను అందించటం, పోషకాహార లోపం లేకుండా చూడటం, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట పరికరాలతో బోధన చేయటం వంటివి చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కేఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఓటర్లు స్వతంత్రంగా ఆలోచించి కేఎస్ లక్ష్మణరావుకు ఈనెల 27న జరగనున్న కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మె ల్సీ ఎన్నికలలో మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని శనివారం ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ కోరారు. స్థానికంగా ఉన్న పలు ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు, పట్టభద్రులను కలసి లక్ష్మణరావుకు మద్దతుగా ప్రచారం చేశారు.

పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలి



డస్ట్‌బిన్‌లను పంపిణీ చేస్తున్న పంచాయితీ క్లాప్‌మిత్రలు

యడ్లపాడు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పచ్చదనం, పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలని ఎంపీడీవో హేమలతాదేవి అన్నారు. శనివారం మండలంలోని అన్ని పంచాయతీలలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా పంచాయతీ కార్యాలయాలను, పరిసరాలను శుభ్రపరిచారు. సోర్స్. రీసోర్స్ కార్యక్రమంలో భాగంగా పంచాయతీల ఆదాయ వనరులను పెంపొందించడం, తడి, పొడి చెత్తలను వేరుచేయడం, వర్మి కంపోస్టు తయారీ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. వంకాయలపాడులో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో హేమలతాదేవి, ఈవోపీఆర్డీ జాకీర్‌హుస్సేన్‌లు పాల్గొని స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమ లక్ష్యాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామస్తులకు డస్టబిన్‌లను క్లాప్‌మిత్రలు పంపిణీచేశారు. యడ్లపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ విజయశ్రీతోపాటు కార్యాలయ సిబ్బంది పరిసరాలను శుభ్రం చేశారు.



కార్యక్రమంలో పాల్గొన్న డీఎస్పీ కే నాగేశ్వరరావు, రవాణా శాఖ అధికారి జీ సంజీవ్‌కుమార్, ఎంవీఐలు, ఏఎంవీఐలు

రోడ్డు భద్రతతో ప్రాణాలు సురక్షితం

● డీఎస్పీ కే నాగేశ్వరరావు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రోడ్డుభద్రత ప్రమాదాలను నివారించడంతో పాటు ప్రాణాలను రక్షించడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందని డీఎస్పీ కే నాగేశ్వరరావు అన్నారు. 36వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా పట్టణంలో ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ యువత హెల్మెట్‌లను తప్పక ధరించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ అతివేగం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం ప్రమాదాలకు కారణం అన్నారు. మైనర్లు వాహనాలు నడపడం వలన ప్రమాదాలు పెరుగుతున్నాయని కళాశాల ఎండీ షేక్ మస్తాన్‌షరీఫ్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహీద్దీన్ అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో హెచ్ గంగాధర్‌రావు, జిల్లా రవాణా శాఖాధికారి జీ సంజీవ్ కుమార్, నరసరావుపేట, పిడుగురాళ్ళ, మాచర్ల, చిలకలూరిపేట ఎంవీఐలు ఎన్ శివనాగేశ్వరరావు, సీహెచ్ రాంబాబు, డీ శేషురెడ్డి, కేఎల్ రావు, ఏఎంవీఐలు సీహెచ్ మనీషా, ఎంఎల్ వంశీకృష్ణ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యర్థాల నుంచి సంపద సృష్టి దిశగా అడుగులు వేద్దాం

● కలెక్టర్ అరుణ్ బాబు

నరసరావుపేట రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర లక్ష్యంతో వ్యర్థాలనుంచి సంపదసృష్టి దిశగా అడుగులు వేద్దామని కలెక్టర్ పి అరుణ్ బాబు శనివారం పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచి ఉద్దేశంతో అధికారులు, సిబ్బంది, ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఇదే స్ఫూర్తితో కార్యాలయాల్లో పెండింగ్ ఫైల్స్ పరిష్కారం అయ్యేలా చూడాలని కోరారు. ప్రతి మూడో శనివారం తప్పనిసరిగా ఈ కార్యక్రమం నిర్వహించాలన్నారు. తడి, పొడిచెత్త సేకరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఆ మేరకు ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. జేసీ సూరజ్, డీఆర్వో మురళి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరేడ్ గ్రౌండ్‌లో మొక్కలు నాటిన పోలీస్ అధికారులు

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో శనివారం ఎస్పీ కంచి శ్రీనివాసరావు మొక్కలు నాటారు. కార్యక్రమంలో పరిపాలన అదనపు ఎస్పీ సంతోష్, ఏఆర్ అదనపు ఎస్పీ సత్తిబాబు, పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను తగ్గించాలి: ఎస్పీ

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసులను హేతు బద్ధంగా విశ్లేషించి తగ్గించాలని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు సూ చించారు. ఎస్పీ కార్యాలయంలో పల్నాడు జిల్లా పోలీస్ అధికారులతో ఆయన శనివారం నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్లను ఆశ్రయించే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. సమస్యలను ఓపికగా వినాలన్నారు. బాధితులకు న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగించాలని ఆయన సూచించారు. మహిళలు, బాలికలు, చిన్నారుల ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధుల నిర్మూలన

● శావల్యాపురం వైద్యాధికారి రాధాకృష్ణన్

శావల్యాపురం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రజలంతా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొన్నప్పుడే వ్యాధులు దరిచేరకుండా ఉంటాయని, చికిత్స కంటే నివారణే ఉత్తమమైన మార్గమని పీహెచ్‌సీ వైద్యాధికారి మాన్యం రాధాకృష్ణన్ తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది శావల్యాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శనివారం పరిసరాలను శు భ్రం చేశారు. అనంతరం వైద్యసిబ్బంది అంతా పరిసరాల పరిశుభ్రతకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. హెల్త్‌సూపర్‌వైజర్ ఏడుకొండలు, ల్యాబ్ టెక్నీషియ న్లు సీతారామయ్య, సతీష్, ఫార్మసిస్ట్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత ఆరోగ్యానికి మేలు కొలుపు

● డీఈవో చంద్రకళ



శుభ్రం చేస్తున్న డీఈవో చంద్రకళ తదితరులు

నాదెండ్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రత ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి మేలుకొలుపు అని డీఈవో చంద్రకళ అన్నారు. మండలంలోని కెల్లంపల్లి భద్రాచలం ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమెతో పాటు ఉపాధ్యాయులు చీపుర్లతో ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా చంద్రకళ మాట్లాడుతూ స్వచ్ఛతకు ప్రాధాన్యత ఇవ్వటం ద్వారా విద్యార్థులు ఆరోగ్యంగా, ప్రశాంతంగా చదువుకోగలుగుతారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



చెన్నయ్య కుటుంబానికి నగదును అందజేస్తున్న ఉపాధ్యాయులు

బొల్లాపల్లి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల వనరుల విద్యా కేంద్రంలో డేటా ఆపరేటరుగా పనిచేస్తున్న మాదినేని చెన్నయ్య గుండెపోటుతో మరణించారు. చెన్నయ్య కుటుంబానికి మండలంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, మండల ఎంఈవోలు సయ్యద్ జఫ్రుల్లా, పార్వతిల సహకారంతో రూ 2,30,500 అందజేశారు. కార్యక్రమంలో చంద్రజిత్‌యాదవ్, ప్రకాష్, రాజేశ్వరరావు, కోటానాయక్ తదితరులు ఉన్నారు.

వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిని సారించాలి

● ఎంఈవో లలితాకుమారి

శావల్యాపురం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో వెనకబడినవారిని ఉపాధ్యాయులు గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టిని సారించాలని, మంచి శిక్షణనిచ్చి వారి సామర్థ్యాలను మెరుగుపరచాలని ఎంఈవో పుసులూరి లలితాకుమారి అన్నారు. శావల్యాపురం జడ్పీ పాఠశాలలో శనివారం మండలంలోని పాఠశాలల ఉపాధ్యాయులతో ఆమె క్లస్టర్ సమావేశాన్ని నిర్వహించారు. బడిబయటి పిల్లలను పాఠశాలల్లో చేర్పడం, పాఠశాలల్లో డీ-గ్రేడ్ పిల్లలకు అందిస్తున్న విద్యాబోధన, పాఠశాలల్లో ప్రారంభించిన స్టార్‌గ్రేడింగ్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్‌లు రాజారమేష్, రవికుమార్, సీఆర్పీ శివప్రసాద్ పాల్గొన్నారు.